శనివారం
19-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 118
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## హమాస్ అధినేత ఖలీల్ హయ్యా

**జెరూసలేం:** ఇజ్రాయిల్ దాడుల్లో తమ అధినేత యాహ్యా సిన్వర్ మృతి చెందినట్లు హమాస్ ధ్రువీకరించింది. కొత్త నాయకుడిగా ఖలీల్ హయ్యా పేరు ప్రకటించింది. సిన్వర్ స్థానంలో హయ్యా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపింది. సిన్వర్‌కు సంతాప సూచికంగా ఖలీల్ హయ్యా టీవీ మాధ్యమంగా సందేశమిచ్చారు. ఆయన సేవలను కొనియాడారు. సిన్వర్ ప్రాణ త్యాగం వృధా కాబోదన్నారు. గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ ముగిసేంత వరకు బందీలను విడిచిపెట్టేది లేదని ఖలీల్ హయ్యా తేల్చిచెప్పారు. ఇజ్రాయిల్ దళాలు గాజా నుంచి పూర్తిగా ఉపసంహరించుకునేంత వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జెరూసలేం రాజధానిగా పలస్తీనా దేశ స్థాపన వరకు హమాస్ పోరు ఆగబోదని ఖలీల్ హయ్యా నొక్కిచెప్పారు.

## ఉచిత ఇసుక రవాణాకు అనుమతి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఉచిత ఇసుక విధానంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల జోక్యం, ఎగుమతి, రవాణా చార్జీల విషయంలో నెలకొంటున్న ఇబ్బందుల కారణంగా విపక్షాల నుంచి ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. పేరుకు ఉచిత ఇసుక అంటున్నా నిర్మాణదారులకు ఇసుక కొనుగోలు భారంగా ఉంటోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రీచ్‌ల నుంచి సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగానే ట్రాక్టర్లలో తీసుకెళ్లేందుకు అనుమతి

- మిగతా 2 లో

## ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్

**న్యూఢిల్లీ:** ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు బెయిల్ వచ్చింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన జైన్‌కు రెండేళ్ల తర్వాత బెయిల్ లభించింది. శుక్రవారం ఢిల్లీ కోర్టులో ఆయనకు ఈ ఊరట లభించింది. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి సంబంధించి మనీలాండరింగ్ లావాదేవీల కేసులో 2022 మే 30వ తేదీన సత్యేందర్ జైన్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. 2015-16 సమయంలో హవాలా నెట్‌వర్క్

- మిగతా 2 లో

## నేడు రైతులతో పంజాబ్ సీఎం చర్చలు

**చండీగఢ్:** ధాన్యం సేకరణకు సంబంధించి పంజాబ్‌లో ఆందోళనను రైతులు చేపట్టారు. ఆలస్యంగా సేకరించిన ధాన్యం విషయంలో రైతులతో శనివారం సాయంత్రం చర్చలకు సీఎం భగవంత్ మాన్ ఆహ్వానం పంపగా, అన్నదాతలు అంగీకరించారు. అంతకుముందు సీఎం నివాసం వరకు మార్చ్‌కు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతలు, రైస్ మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు యత్నించగా పోలీసులు అడ్డుకొని కొందరిని అరెస్టుచేశారు. కిసాన్ భవన్ వరకు చేరుకున్న వారిని అక్కడే బ్యారికేడ్లు, రాపిడ్ యాక్షన్

- మిగతా 2 లో

## ఇదీ లోకం!




# మహిళలకు దీపావళి ధమాకా

- ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్ల పథకం అమలు
- ఇసుక, మద్యంలో జోక్యాన్ని సహించం
- వైసీపీ నేతలు చేసిన తప్పులు మీరూ చేయొద్దు
- ఎన్నికల మేనిఫెస్టో అమలుపై ప్రజలకు ధైర్యంగా చెప్పండి
- కక్ష సాధింపులుండవు... తప్పు చేసిన వారిని వదలం
- సీఎం చంద్రబాబు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు శుభవార్త వినిపించారు. నాలుగు నెలలుగా మహిళలు ఎదురుచూస్తున్న ఉచిత వంట గ్యాస్ పథకం ఎట్టకేలకు దీపావళి నుంచి అమలు కాబోతోంది. సూపర్‌సిక్స్‌లో కీలకమైన ఈ పథకాన్ని దీపావళి పండుగ సందర్భంగా ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇంచార్జులు, ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సూపర్‌సిక్స్‌లో మరో కీలకమైన హామీ మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ ప్రస్తావన ఈ సమావేశంలో తీసుకురాలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై టీడీపీ నేతలు గుండె మీద చేయి వేసుకొని ప్రజలకు ధైర్యంగా చెప్పవచ్చునన్న చంద్రబాబు... వివిధ అంశాలపై అనుసరించాల్సిన విధానాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. 125 రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులు సమీక్షించుకుని ముందుకెళ్లాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎన్డీయే అధికారంలో ఉంది. మూడు పార్టీలను సమన్వయం చేసుకోవడంతో పాటు మద్దతు ఇచ్చిన ప్రజల ఆశలు నెరవేర్చాలి. గత పాలకులు కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించారు. ఇప్పుడు నిధులు అడుగుతుంటే గతంలో ఇచ్చిన నిధులకు యూసీలు అడుగుతున్నారని తెలిపారు. మన ప్రభుత్వంలో కక్షసాధింపులు ఉండవని,

- మిగతా 2 లో

## 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఏపీ కేబినెట్ సమావేశాన్ని మరోసారి ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీజేశారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో అనేక కీలక అంశాలపై చర్చించనున్నారు. సూపర్ సిక్స్ అమలుపై దృష్టి సారించే అవకాశముంది. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో కొన్నింటిపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిసింది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం అమలు, దేవదాయశాఖకు చెందిన అనేక కీలక నిర్ణయాలపైనా చర్చిస్తారు. ఉచిత బస్సు ప్రయాణంపై ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన అధ్యయనం, అమలులో ఎదురయ్యే అంశాలపైనా చర్చిస్తారని సమాచారం. ఆమోదముద్ర వేసే అవకాశముంది. వాటితోపాటు మరిన్ని అభివృద్ధి పనులపైనా చర్చించనున్నారు. ఈనెల 10న కేబినెట్ సమావేశం నిర్ణయించగా, ప్రాముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతితో ఆయనకు సంతాపం ప్రకటించి, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం 16వ తేదీన మంత్రి మండలి సమావేశాన్ని నిర్వహించి, ఆరు పాలసీలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 19 అంశాలపై ఆమోదముద్ర వేశారు. 23న జరగబోయే కేబినెట్ సమావేశంలో మరికొన్ని అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.

# విద్యుత్ బాదుడు ఆపండి

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్

**విశాలాంధ్ర-విజయవాడ:** విద్యుత్ చార్జీల పెంపు, ట్రూఅప్ చార్జీల విధింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వంటి విద్యుత్ భారాలను ప్రజలపై రుద్దవద్దని, విద్యుత్ చార్జీల బాదుడు నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ జాతీయ రాజకీయ పరిణామాల గురించి వివరించగా... రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, భవిష్యత్ కర్తవ్యాల గురించి వివరించారు. దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను గత వైసీపీ ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తూ 8 పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి, దాదాపు రూ.50 వేల కోట్ల మేర రాష్ట్ర ప్రజలపై భారం మోపిందని తీర్మానం విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా అదనంగా మరో రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని అభిప్రాయపడింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమవ్వడాన్ని ఖండించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రస్తుతం రూ.8,114 కోట్ల మేరకు భారం మోపేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధమవ్వడంపై విచారం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సంస్థలు హిందూజా సంస్థకు (హెచ్‌ఎన్‌పీసీఎల్) రూ.1,234.68 కోట్లు చెల్లించి... ఆ భారాన్ని ట్రూఅప్ ప్రతిపాదనలలో కలపడం దుర్మార్గమని విమర్శించింది.

తాము అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ... అధికారం చేపట్టాక విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలకు కరెంట్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవ్వడాన్ని సీపీఐ రాష్ట్ర సమితి నిరసించింది.

తక్షణమే విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు ఎత్తివేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## 'లొంగిపోతే పోరు ముగుస్తుంది'

### పలస్తీనా ప్రజలకు నెతన్యాహు వీడియో సందేశం

హమాస్ తమ ఆయుధాలను సమర్పించి, బందీలు అందరినీ విడుదల చేస్తే పోరు రేపే ముగుస్తుందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించిన కొద్ది సేపటికి గాజా ప్రజలనుద్దేశించి నెతన్యాహు 'ఎక్స్'లో వీడియో సందేశమిచ్చారు.

2లో

## ఇక సుప్రీంలో కేసులన్నీ ప్రత్యక్ష ప్రసారం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. లోటుపాట్లు సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష

- మిగతా 2 లో

# సీపీఐ వయనాడ్ అభ్యర్థి సత్యన్ మొకేరి

**వయనాడ్:** కేరళ ఉపపోరుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సిద్ధమని ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నిక కోసం ఎల్డీఎఫ్ అభ్యర్థిగా సత్యన్ మొకేరి పేరును శుక్రవారం ప్రకటించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకేరి అభ్యర్థిత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఆమోదించినట్లు తెలిపారు. ఆయన పేరును కేరళ రాష్ట్ర సమితి ప్రతిపాదించిందని రాజా వెల్లడించారు. కాగా, సత్యన్ మొకేరి ఏఐఎస్ఎఫ్ ద్వారా రాజకీయాల్లోకి

- మిగతా 2 లో

### ఆశావాదంతో పోటీలోకి: సత్యన్ మొకేరి

గతంలో వయనాడ్‌లో పోటీ చేసిన అనుభవం తనకు కలిసివస్తుందని, యూడీఎఫ్ అభ్యర్థి ప్రియాంక గాంధీపై విజయం సాధిస్తానన్న ఆశావాదంతో పోటీలోకి దిగుతున్నట్లు సత్యన్ మొకేరి తెలిపారు. గత ఓటమి నేర్పిన పాఠాలతో గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకెళ్లనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, కె.కరుణాకరన్ వంటి హేమాహేమీలు గతంలో ఓటమిని చవిచూశారని, ప్రియాంక గాంధీకి పరాభవనం తప్పదని సత్యన్ మొకేరి అన్నారు.

## రూ.5 కోట్లు ఇస్తే వదిలేస్తాం

### సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు

**ముంబై:** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ సందేశం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబై ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా... లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే మాజీ ఎమ్మెల్యే సిద్దిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని దుండగులు బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసి... దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడి

- మిగతా 2 లో

# ప్రాజెక్టులకు జలకళ

### ఆగని వర్షాలు... ప్రజలకు ఇక్కట్లు

### లోతట్టు ప్రాంతాలు జలమయం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాయలసీమ ప్రాంతంలో ప్రాంతంలో ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. గుండకమ్మ వాగు ఉప్పొంగుతుండగా... తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. విశాఖపట్నం, కాకినాడలో ఎడతెరపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విశాఖ ఆర్కేబీచ్, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాకినాడ ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. శుక్రవారం కూడా కాకినాడ నగరంలో కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల నుంచి ఏకధాటిగా వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి

- మిగతా 2 లో

# ఈవీఎం హ్యాకింగ్ సులభమే

### పేపర్ బ్యాలెట్ మేలు: మస్క్

**కోల్‌కతా:** ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) కంటే పేపర్ బ్యాలెట్లే మేలని టెస్లా సీఈవో ఎలన్ మస్క్ పునరుద్ఘాటించారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలోని ఒక టౌన్ హాలులో జరిగిన సభకు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిగిన ఒక ప్రశ్నకు మస్క్ సమాధానమిస్తూ 'పేపరు బ్యాలెట్లు... ఓట్లను చేతితో లెక్కించడమే మేలు అని నా అభిప్రాయం' అని స్పష్టం చేశారు. ఎన్నికల నుంచి సాంకేతిక పరిజ్ఞానం దూరంగా ఉండాలని తాను ఎందుకు కోరుకుంటున్నాననే విషయాన్ని చెబుతూ... 'నేను ఒక సాంకేతికుడిగా కంప్యూటర్ల గురించి చాలా తెలుసు. నేను చేసే చివరి పని ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్‌ను

- మిగతా 2 లో

# పేదరికంలో 100 కోట్ల మంది

### ఘర్షణ ప్రాంతాల్లో సగం మంది చిన్నారులు... ఇతరులు



**ఐరాస:** ప్రపంచ వ్యాప్తంగా పేదరికం స్థాయి పెరిగిపోతోంది. 100 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన పేదరికం అనుభవిస్తున్నారు. సగానికి పైగా చిన్నారులు, దాదాపు 40 శాతం మంది సంఘర్షణతో దెబ్బతిన్న, సున్నిత సమస్యలతో అల్లాడుతున్న దేశాలలో నివసిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ), ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని ఆక్స్‌ఫర్డ్ పేదరికం, మానవాభివృద్ధి చొరవ నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. 83 శాతం కంటే ఎక్కువ మంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, అదే శాతం సబ్-సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో నివసిస్తున్నారని తెలిపింది. యూఎన్‌డీపీ, ఆక్స్‌ఫర్డ్ 2010 నుంచి ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు సహా 10 సూచికలను ఉపయోగించి ఎంపీఐ అని పిలువబడే బహుళ కోణాల పేదరిక సూచికను ప్రచురిస్తున్నాయి. ఈ ఏడాది సూచికలో మొత్తం 630 కోట్ల మంది జనాభాతో 112 దేశాల వివరాలు ఉన్నాయి. సూచిక ప్రకారం, 100 కోట్ల మందికి పైగా ప్రజలు తీవ్ర పేదరికంలో నివసిస్తున్నారు. అందులో ఐదు దేశాలలో దాదాపు సగం మంది ఉన్నారు. భారతదేశంలో 23.4 కోట్ల మంది, పాకిస్థాన్‌లో 9.3 కోట్ల మంది, ఇథియోపియాలో 8.6 కోట్ల మంది, నైజీరియాలో 7.4 కోట్ల మంది, కాంగోలో

- మిగతా 2 లో

# ‘లొంగిపోతే పోరు ముగుస్తుంది’

పలస్తీనా ప్రజలకు నెతన్యాహు వీడియో సందేశం

ఇరాన్ ఉగ్ర సామ్రాజ్యం కూలిపోతోందని వ్యాఖ్య

యాహ్యా సిన్వర్‌ను హతమార్చాం: ఇజ్రాయిల్ సైన్యం

**టెల్‌అవీవ్:** హమాస్ తమ ఆయుధాలను సమర్పించి, బందీలు అందరినీ విడుదల చేస్తే పోరు రేపే ముగుస్తుందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించిన కొద్ది సేపటికి గాజా ప్రజలనుద్దేశించి నెతన్యాహు ‘ఎక్స్’లో వీడియో సందేశమిచ్చారు. యాహ్యా సిన్వర్ హతమయ్యాడు. ఇజ్రాయిల్ సైనికులు అతనిని రఫాలో మట్టుబెట్టారు. గాజాలో పోరుకు ఇది ముగింపు కాబోదు. ముగింపునకు ఇది ఆరంభం మాత్రమే అవుతుంది. గాజా ప్రజలారా మీకు నేను ఒక సాదాసీదా సందేశమిస్తున్నారు. ఈ పోరు రేపటికల్లా ముగించేయవచ్చు. అందుకోసం హమాస్ లొంగిపోవాలి. బందీలను విడిచిపెట్టాలి’ అని నెతన్యాహు పేర్కొన్నారు. సిన్వర్‌తో పాటు మరో ఇద్దరు సాయుధులను తమ సైన్యం హతమార్చినట్లు ఇజ్రాయిల్ గురువారం ప్రకటించింది. గాజాలో 101 మంది హమాస్ వద్ద బందీగా ఉన్నారని, ఇజ్రాయిల్‌తో సహా 23 వేర్వేరు దేశాల పౌరులు వారిలో ఉన్నారని నెతన్యాహు వెల్లడించారు. బందీలందరినీ విడిచిపెంచి, వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉందని వక్కాణించారు. ఇజ్రాయిలీలను బందీలుగా ఉంచిన వారికి చుక్కలు చూపిస్తామంటూ హెచ్చరించారు. బందీలకు హాని తలపెడితే ఉపేక్షించేది లేదని, వెంటాడి చంపుతామని పేర్కొన్నారు. ఇరాన్ నిర్మించిన ఉగ్ర సామ్రాజ్యం మీ కళ్ల ఎదుటే కూలిపోతోంది చూడండి అంటూ స్థానికులనుద్దేశించి నెతన్యాహు అన్నారు. హసన్ నస్రల్లా వంటి హెజ్బుల్లా కీలక నేతలను ఇజ్రాయిల్ హతమార్చిందని తన సందేశంలో ఆయన గుర్తుచేశారు. ‘నస్రల్లా, మొహ్‌సెన్, హనియే, డెయిఫ్, సిన్వర్ అంతా చనిపోయారు. ఇరాక్, సిరియా, లెబనాన్, యెమన్‌తో పాటు తమ సొంత ప్రజలపై ఇరాన్ సాగిస్తున్న ఉగ్ర పాలన అంతానికి చేరువైంద’ని నెతన్యాహు వ్యాఖ్యానించారు. ‘శాంతి, సుసంపన్నమైన భవిష్యత్ కోరుకునేవారంతా ఏకం కావాలి... కలిసికట్టుగా చీకటిశక్తులను పారద్రోలి... ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకుందాం, మన ఆకాంక్షలు నెరవేర్చుకుందాం’ అని పశ్చిమాసియా ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే తయిబే ప్రాంతానికి చెందిన హెజ్బుల్లా కమాండర్ మహమ్మద్ హసిన్ రమల్‌ను వైమానిక దాడుల్లో హతమార్చినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు ప్రకటించాయి. మరోవైపు సిన్వర్‌ను ప్రకటించిన తర్వాత గాజాపై విరుచుకుపడ్డాయి. 24 గంటల్లో గాజా, లెబనాన్‌లో జరిపిన వైమానిక దాడుల్లో 150కుపైగా ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది.

# దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఓటమి

55 మంది శత్రు సైనికులు హతం

500 మందికి గాయాలు: హెజ్బుల్లా

**బీరుట్:** దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ చిత్తైనట్లు హెజ్బుల్లా ప్రకటించింది. శత్రు సైన్యాన్ని ఓడించామంటూ లెబనీస్ షియా మూవ్‌మెంట్ హెజ్బుల్లా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. భూతల దాడులు మొదలైనప్పటి నుంచి శత్రు దేశానికి చెందిన 55 మంది చనిపోగా మరో 500 మందికిపైగా సైనికులు, అధికారులకు గాయాలయ్యాయని తెలిపింది. 20 మెర్కావ ట్యాంకులు, నాలుగు మిలటరీ బుల్డోజర్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. లెబనాన్ సరిహద్దు వెంబడి బ్యారక్‌లు, పట్టున్న ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో చనిపోయిన, గాయపడిన ఇజ్రాయిలీ సర్వీస్‌మెన్ లెక్క ఈ జాబితాలో లేదని వెల్లడించింది. ఇజ్రాయిల్‌పై దాడుల్లో కొత్త దశ మొదలవుతోందని, పోరు మరింత తీవ్రరూపం దాల్చనుందని తెలిపింది. అక్టోబరు 1 నుంచి ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 2,415 మంది చనిపోయినట్లు లెబనాన్ మంత్రిమండలి ప్రకటించింది. గాయపడిన వారి సంఖ్య 12వేలకు చేరువైనట్లు వెల్లడించింది.

**గాజా, లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ఆపాలి: మాక్రాన్**

గాజా, లెబనాన్‌లో దాడులు ఆపి... రాజకీయపరంగా చర్చలకు ముందుకు రావాలని ఇజ్రాయిల్‌ను కోరినట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తెలిపారు. ఆ దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలని, ఐరాస నిబంధనలకు కట్టుబడాలని, ముఖ్యంగా యూఎన్‌ఐఎఫ్‌ఐఎల్ శాంతి దూతల విషయంలో నిబద్ధతతో వ్యవహరించాలని హితవు పలికినట్లు చెప్పారు. బ్రెస్సెల్స్‌లో జరిగిన ఈయూ సదస్సు అనంతరం మాక్రాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ‘హమాస్ నాయకుడు యాహ్యా సిన్వర్ మరణం... ఈ పోరు అంతానికి ఒక అవకాశంగా ఉండాలి. సైనిక కార్యకలాపాలను తక్షణమే ఆపి... గాజాలో కాల్పులు విరమించాలి. విశ్వసనీయ రాజకీయపరమైన దౌత్యాన్ని ఇజ్రాయిల్, పలస్తీనా ప్రజల మధ్య జరిపించాలి’ అని అన్నారు.

**గాజాలో శాంతి బాధ్యత ఐరాసదే: చైనా**

గాజాలో విపత్తుకర పరిస్థితులను కొనసాగనివ్వడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని చైనా పేర్కొంది. శాంతి నెలకొల్పే బాధ్యతలను ఐరాస భద్రతా మండలి తీసుకోవాలని అభిప్రాయపడింది. గాజాలో మానవతా సంక్షోభంపై భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఐక్యరాజ్య సమితికి చైనా శాశ్వత ప్రతినిధి ఫు కాంగ్ మాట్లాడుతూ ఐరాస భద్రతా మండలి తీర్మానాలకు కట్టుబడేలా చర్యలు సమర్థంగా తీసుకోవడం అవసరం. ‘టూ స్టేట్’ ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం సాధ్యం’ అని అన్నారు. పలస్తీనాను స్వతంత్ర దేశ హోదా కల్పిస్తే ఘర్షణ సద్దుమణుగుతుందని ఫు అన్నారు. రెండు పక్షాలు అంగీకరించినప్పుడే ‘టూ స్టేట్’ పరిష్కారం అమలు కాగలదని చెప్పారు.

ఇందులో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి...పోరు అంతానికి, పశ్చిమాసియాలో శాంతికి మద్దతిచ్చేందుకు చైనా సిద్ధమని ఫు కాంగ్ వెల్లడించారు. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య తీవ్ర ఘర్షణ సాగుతుండటం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. గాజా సుస్థిరతకు సంకేతాలు అందడం లేవన్నారు. పరిస్థితులు మరింతగా క్షీణిస్తున్నాయని, తక్షణమే తగు విధంగా స్పందించి... ఈ సమస్యను పరిష్కరించడం అత్యవసరమని ఫు కాంగ్ పిలుపునిచ్చారు.

# పేదరికంలో గాజా

## తారస్థాయికి నిరుద్యోగం: ఐరాస-ఐఎల్ఓ

**జెనీవా:** పశ్చిమాసియా రగిలిపోతుండటంతో గాజా స్ట్రిప్ పేదరికంలో కూరుకుపోతోందని ఐక్యరాజ్య సమితి-అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశాయి. ఇజ్రాయిల్ భీకర పోరుతో గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ అస్తవ్యస్తమయ్యాయని, భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలు నేల కూలగా, ఆర్థిక కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని పేర్కొన్నాయి. దాదాపు 100శాతం గాజా ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారని, ఇజ్రాయిల్ దాడులతో కరువు పరిస్థితులు తప్పబోవని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. ఏడాదిగా కొనసాగుతున్న దురాక్రమణతో నిరుద్యోగం, పేదరికం అంచనాలకు మించిపోయినట్లు పేర్కొంది. 100 శాతం జనాభా పేదరికంలో కూరుకుపోగా నిరుద్యోగం తారస్థాయికి చేరుకుందని తాజా నివేదిక వెల్లడించింది. వెస్ట్ బ్యాంక్‌లో నిరుద్యోగం సగటున 35శాతంగా, గాజాలో 79.7శాతంగా నమోదైనట్లు ఐఎల్ఓ తెలిపింది. ప్రాణ నష్టమే కాకుండా మానవతా పరిస్థితులు క్షీణించి, గాజా భౌతికంగా ధ్వంసం కావడంతో ఈ పరిస్థితి దాపురించిందని ఐఎల్ఓకు అరబ్ రాష్ట్రాల ప్రాంతీయ డైరెక్టర్ రుబా జరాదత్ అన్నారు. దీని ప్రభావం భవిష్యత్ తరాలపై తీవ్రంగా ఉంటుందన్నారు. వెస్ట్‌బ్యాంక్ ఆర్థిక సంకోచం (ఎకనామిక్ కాంట్రాక్షన్) దాదాపు రెట్టింపు అయిందని, 2023లో 12శాతం నుంచి 28శాతానికి చేరుకుందని ఐఎల్ఓ వెల్లడించింది. వెస్ట్‌బ్యాంక్‌లో స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) సంకోచం 21.7శాతం మేర ఉండగా గాజా స్ట్రిప్‌లో 84.7శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయిల్ దాడుల్లో 42,409 మంది పలస్తీనియన్లు చనిపోయారని పేర్కొంది. ఆర్థిక దీన స్థితికి తాజా గణాంకాలు అద్దం పట్టాయని, ఇళ్లు, మౌలిక వసతులన్నీ ధ్వంసం కాగా గాజాలో ఆర్థిక కార్యకలాపాల ప్రతిష్టంభన, ఉద్యోగులు, కార్మికుల వలసలతో పరిస్థితి మరింతగా క్షీణించిందని ఐఎల్ఓ వెల్లడించింది. అసంఘటిత రంగం స్తంభించిందని తెలిపింది. ద్రవ్యోల్బణం 248 శాతంగా ఉంది... కరువు కాటకాలు తప్పబోవని ఐరాస హెచ్చరించింది. మానవతా సాయాన్ని సైతం ఇజ్రాయిల్ అడ్డుకుంటడంతో పరిస్థితులు మరింత క్షీణిస్తాయని ప్రకటన వెల్లడించింది.

## సీపీఐ వయనాడ్ అభ్యర్థి సత్యన్ మొకేరి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారు. కాలికట్ యూనివర్సిటీ సెనెట్ సభ్యుడిగా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, కార్యదర్శిగా, జాతీయ సమితి ఉపాధ్యక్షుడిగా, కోజికోడ్ జిల్లా అధ్యక్షుడిగా, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. వయనాడ్ చరిత్రలో ఎల్డీఎఫ్ అభ్యర్థిగా అత్యధిక ఓట్లు సాధించిన ఘనత సత్యన్ మొకేరి సొంతం. 1987 నుంచి ఆయన మూడు సార్లు నాదాపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తిరువనంతపురంలో జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో సత్యన్ మొకేరి అభ్యర్థిత్వం ఖరారైంది. సమావేశంలో సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం పాల్గొన్నారు.

## మహిళలకు దీపావళి ధమాకా

(మొదటిపేజీ తరువాయి)

అలాగని తప్పు చేసిన వారిని వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

**హామీలన్నీ వరుసగా అమలు చేస్తున్నాం**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలిస్తామని చెప్పాం... ఆ విధానం ప్రారంభమైంది. డిసెంబరు నాటికి పూర్తవుతుంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. పింఛన్లు నెలకు రూ.4 వేలు ఇస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఒక క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టాం. నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం. 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ అందిస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం చెత్త పన్ను రద్దు చేశాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు చేశాం. స్వర్ణకారులు కార్పొరేషన్, గౌడలకు మద్యం షాపుల్లో రిజర్వేషన్లు కల్పించాం. అర్చకుల జీతాలు రూ.10 వేలకు పెంపు, నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలకు వేతనం పెంపు చేశాం. ధూపదీప నైవేద్యాలకు రూ.5 వేల నుంచి 10 వేలకు పెంచాం. విజయవాడ వరద సమయంలో రాత్రింబవళ్లు పని చేశాం. మొదటి సారి దేశ చరిత్రలో ఒక్కో ఇంటికి రూ.25 వేలు ఇచ్చాం. వరద సమయంలో నీళ్లు, బిస్కెట్లు, పాలు అందించాం. ఆటోకు రూ.10 వేలు, రూ.3 వేలు బైక్‌లకు ఇచ్చాం. 4.15 లక్షల మందికి రూ.618 కోట్లు పరిహారం కింద అందించామని సీఎం వివరించారు. పారదర్శక పాలనలో భాగంగా జీవోలు ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. గత మద్యం విధానంలో జరిగిన దోపిడీపై విచారణ చేస్తూనే నూతన మద్యం పాలసీని తెచ్చాం. నూతన ఇసుక పాలసీ తెచ్చాం. అయితే ఈ రెండింటి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దు. గత పాలకులు చేసిన తప్పులు చేయవద్దు. ప్రజలన్నీ గమనిస్తారని, డబ్బులతో ఎన్నికలు జరిగితే 93 శాతం సీట్లు మనకు వచ్చేవి కావని చంద్రబాబు అన్నారు.

## నేడు రైతులతో పంజాబ్ సీఎం చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

దళంతో నిర్బంధించారు. ఎస్‌కేఎం నేత రమిందర్ సింగ్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు రోడ్డు వద్దనే పోలీసులు తమను అడ్డుకున్నారని, బల్బీర్ సింగ్ రాజేవాల్‌సహా మరికొందరిని భాగో మాజ్రా వద్ద ఆపేశారని చెప్పారు. అరెస్టు అయిన నేతల్లో మంజిత్ ధనేర్, రుల్దు సింగ్ మాన్సా, అంగ్రేజ్ సింగ్, తర్సేమ్ సింగ్ బైన్స్, గుర్మీత్ సింగ్ మెహ్మా ఉన్నారు. ‘వెనుతిరగబోం... రేపు సీఎంతో చర్చల్లో తాడో పేడో తేల్చుకుంటాం. లేనిపక్షంలో కిసాన్ భవన్ కేంద్రంగా ఆందోళనలు చేస్తాం’ అని నేతలు ఉద్ఘాటించారు. పోలీసుల తీరును ఖండించారు. మరోవైపు మండీల్లో ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేదని రైతులు ఆరోపించగా, ధాన్యం మిల్లింగ్‌నకు మిల్లర్లు తిరస్కరించారు. అయితే నిల్వ చేసేందుకు తమ స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చేందుకు వారు అంగీకరించారు. మరోవైపు ధాన్యం ఎంఎస్‌పీపై 2.5శాతం కమీషన్ ఇవ్వాలని కమీషన్ ఏజెంట్లు డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట క్వింటాకు రూ.46 కమీషన్ ఖరారైంది.

# ఈవీఎం హ్యాకింగ్ సులభమే

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసించడం. ఎందుకంటే దానిని హ్యాక్ చేయడం చాలా సులభం. కేవలం ఒక లైన్ (కోడ్‌కు సంబంధించి) జోడించడం సులభం. అదే పేపర్ బ్యాలెట్లను హ్యాకింగ్ చేయడం కష్టతరం’ అని తెలిపారు. 47 నిమిషాల 28 సెకన్ల తన ప్రసంగ వీడియోలో ఆయన పేపర్ బ్యాలెట్లకు అనుకూలంగా 58 సెకన్లు మాట్లాడారు. రోజువారీ అమెరికన్ టీవీ వార్తా కార్యక్రమానికి చెందిన ఈ వీడియో శుక్రవారం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇదిలాఉండగా ‘ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లలో బలమైన సాంకేతిక రక్షణలు, ఈసీఐ ఏర్పాటు చేసిన విస్తృతమైన పరిపాలన, భద్రతలు, విధానాలు, ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూస్తాయి’ అని పేర్కొంటూ భారత ఎన్నికల సంఘం నుంచి ఒక నిరాకరణను కూడా యూట్యూబ్ జోడించింది. పేపర్ బ్యాలెట్‌లకు అనుకూలంగా మస్క్ మాట్లాడిన 58 సెకన్ల వీడియో దృశ్యాన్ని భారతదేశంలోని ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో విస్తృతంగా పంచుకున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో బీజేపీ గెలిచిన ప్రతి ఎన్నికల తర్వాత పేపర్ బ్యాలెట్‌లకు తిరిగి రావాలని ప్రతిపక్షాల నుంచి గట్టి డిమాండ్లు వచ్చాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల సంఘంతో కాంగ్రెస్ వాదనకు దిగింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. కానీ కొన్ని ఎన్నికల విశ్లేషణలు మాత్రం రాష్ట్రంలోని 90 అసెంబ్లీ స్థానాల్లో 86 స్థానాల్లో ఈసీఐ ఓటింగ్ శాతం వివరాలలో అసమతుల్యతను ఎత్తిచూపాయి. మరో నెల రోజుల తర్వాత జార్ఖండ్, మహారాష్ట్రలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో సాంకేతికతను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ మస్క్ మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన కొన్ని రోజుల తర్వాత ‘ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తొలగించడం’ కోసం ఆయన పిలుపునిచ్చారు. ఇవి మానవులు లేదా కృత్రిమ మేధస్సు ద్వారా హ్యాక్ చేయబడే ప్రమాదం ‘చిన్నగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ చాలా ఎక్కువ’ అని అన్నారు. కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్... మస్క్ కోసం ఈవీఎంలపై అవగాహన నిర్వహించాలని ఎద్దేవా చేశారు. అయితే మస్క్ ఆ ప్రతిపాదనకు స్పందించకుండా...‘ఏదైనా హ్యాక్ చేయవచ్చు’ అంటూ బదులిచ్చారు. పెన్సిల్వేనియాలో మస్క్ ఒక హెచ్చరిక చేస్తూ... ప్రజాస్వామ్య ఎన్నికలు జరిగే దాదాపు ప్రతి దేశానికి ఓటరు గుర్తింపు కార్డుతో వ్యక్తిగతంగా ఓటింగ్ అవసరం. ఇది విచిత్రం, అది లేకపోవడం చాలా విచిత్రం. మోసాన్ని సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది ఏకైక మార్గం అని నేను భావిస్తున్నాను’ అని అన్నారు. భారతదేశం పాలక వ్యవస్థ ఈవీఎంలతో దృఢంగా ఉన్నప్పటికీ... ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డుల జాబితా భారతదేశాన్ని కొద్దిగా విచిత్రంగా చేస్తుందని మస్క్ తెలిపారు.

## రూ.5 కోట్లు ఇస్తే వదిలేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబై పోలీసులు వెల్లడించారు. అదేసమయంలో బాంద్రాలోని సల్మాన్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ అనేకమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. సల్మాన్ ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రత పెంచింది.

## ఇక సుప్రీంలో కేసులన్నీ ప్రత్యక్ష ప్రసారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ ‘సేన వర్సెస్ సేన’ కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో షిండే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవ డం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదేనంటూ ఠాక్రే, షిండే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీం కోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ... ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్‌వీ రమణ పదవీ విరమణ రోజు... ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణలను దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

# ప్రాజెక్టులకు జలకళ

(మొదటిపేజీ తరువాయి)

బియ్యం ఎగుమతులకు ఆటంకం ఏర్పడింది. బార్జీల నుంచి నౌకలకు బియ్యం రవాణాను అధికారులు నిలిపివేశారు. ఇకపోతే... ప్రకాశం జిల్లా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లో వేకువజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. మార్కాపురం మండలం బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. తర్లుపాడు - మార్కాపురం మధ్య కొండవాగు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. తుంగభద్ర జలాశయం, శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి... నీటిని దిగువకు విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం నుంచి 10 గేట్ల ద్వారా నీటిని వదిలారు. పూర్తిస్థాయి నీటి మట్టం 1633 అడుగులు కాగా... ప్రస్తుత నీటి మట్టం 1631.93 అడుగులకు చేరింది. అలాగే ఇన్‌ఫ్లో 50,593 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 36,799 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకుగాను.. ప్రస్తుతం 101.500 టీఎంసీలుగా నమోదైంది. ఇటు నంద్యాలలోని శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది.

ఇన్ ఫ్లో 79,536 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 67,626 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా... ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలకుగాను... ప్రస్తుతం 212.9198 టీఎంసీలుగా ఉంది. మరోవైపు కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

### సాగర్‌కు నీరు విడుదల

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు:** శ్రీశైలం జలాశయానికి ఎగువ జూరాల, సుంకేసుల నుండి నీరు వచ్చి చేరుతుండటంతో స్పిల్‌వే గేట్ ఒకటి ఎత్తి దిగువన నాగార్జునసాగర్‌కు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఎగువ జూరాల నుండి 83,891 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 38,493 క్యూసెక్కులు, హంద్రీ నుండి 250 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతుండగా... అక్కడ నుండి ఏపీ జలవిద్యుత్ ఉత్పత్తికి 30,962 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కు 36,900 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 27,891 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

## ఉచిత ఇసుక రవాణాకు అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చింది. ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఈ మార్పులు చేస్తూ సవరణ ఉత్తర్వును రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. స్థానికంగా అవసరాలకు ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్లతోనూ ఇసుక తీసుకువెళ్లేందుకు అనుమతి ఇస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో సొంత అవసరాలకు రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు ఎడ్ల బండ్లను మాత్రమే అనుమతించామని, ప్రస్తుతం ఆ ఉత్తర్వును సవరిస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇది ట్రాక్టర్లకూ వర్తిస్తుందని గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు ఇచ్చారు. స్థానిక అవసరాల నిమిత్తమే ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్లవచ్చని స్పష్టం చేశారు. తక్షణం అమలు చేపట్టాల్సిందిగా గనులశాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవల పట్టా భూముల్లో కూడా ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతోపాటు డీకేటీ పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన గైడ్‌లైన్స్ జారీ చేస్తూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గృహనిర్మాణదారులకు ఉచిత ఇసుక రవాణా సులభతరం అవుతుంది. మరోవైపు కొత్తగా 108 ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. నదుల్లో ఉధృతి దృష్ట్యా తొలి విడత వినియోగంలోకి 40 ఇసుక రీచ్‌లు తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. నదీ తీర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉంటే అధికారులు గుర్తింపు ఇవ్వనున్నారు.

## ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా జైన్ కంపెనీలకు... షెల్ కంపెనీల నుంచి సుమారు రూ.4.81 కోట్ల వరకు అందినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ... ఈ హవాలా కేసు దర్యాప్తు ప్రారంభించింది.

ఈ క్రమంలోనే సత్యేందర్‌తో పాటు ఆయన కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ... ఆయనను అరెస్టు చేసింది.

# 9 వర్సిటీలకు వీసీల నియామకం

**విశాలాంధ్ర-హైదరాబాద్:** రాష్ట్రంలో తొమ్మిది వర్సిటీలకు వీసీలను నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రభుత్వం వీసీల నియామకానికి దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 1380కిపైగా దరఖాస్తులు రావడంతో అర్హుల ఎంపిక బాధ్యతను విద్యాశాఖ సెర్చ్ కమిటీలకు అప్పగించింది. దరఖాస్తులను పరిశీలించిన కమిటీ... జాబితాను ఇటీవల గవర్నర్‌కు పంపింది. ప్రభుత్వం పంపిన జాబితాకు ఆమోదం తెలిపిన గవర్నర్... తొమ్మిది వర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పాలమూరు యూనివర్సిటీ- జి.ఎన్.శ్రీనివాస్, కాకతీయ - ప్రతాప్‌రెడ్డి, ఓయూ - ఎం.కుమార్, శాతవాహన- ఉమేశ్ కుమార్, తెలుగు వర్సిటీ - నిత్యానందరావు, మహాత్మాగాంధీ- అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ వర్సిటీ - యాదగిరిరావు, జయశంకర్ - జానయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వర్సిటీకి రాజిరెడ్డిని వీసీలుగా నియమించారు.

**స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ రూ.100 కోట్ల విరాళం**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కు అందజేశారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేదరికంలో 100 కోట్ల మంది

(మొదటిపేజీ తరువాయి)

6.6 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. కాగా పేదరికంలో నివసిస్తున్న వారిలో సగానికిపైగా... 58.4 కోట్ల మంది 18 ఏళ్లలోపు పిల్లలు, సబ్-సహారా ఆఫ్రికాలో 31.7 కోట్ల మంది, దక్షిణాసియాలో 18.4 కోట్ల మంది ఉన్నారు. పేదరికం పెరిగిన అఫ్గానిస్థాన్‌లో పేద పిల్లల నిష్పత్తి ఇంకా ఎక్కువగా దాదాపు 59 శాతం ఉంది. యూఎన్‌డీపీ, ఆక్స్‌ఫర్డ్ వివరాల ప్రకారం... ఈ సంవత్సరం నివేదిక సంఘర్షణలు జరుగుతున్న దేశాల్లో పేదరికంపై దృష్టి సారించింది. ఎందుకంటే రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 2023లో ఎప్పుడూ లేనంత ఎక్కువ సంఘర్షణలు చూసింది. 11.7 కోట్ల మంది ప్రజలు సంఘర్షణలు, విపత్తులు, ఇతర కారణాల వల్ల తమ ఇళ్లను విడిచిపెట్టవలసి వచ్చింది. ‘మొదటిసారి ప్రపంచ ఎంపీఐ వివరాలతో సంఘర్షణ వివరాలను అతివ్యాప్తి చేయడం ద్వారా ఘర్షణ, పేదరికాన్ని ఏకకాలంలో అనుభవిస్తున్న వారికి సంబంధించిన కఠోర వాస్తవాలను నివేదిక వెల్లడిస్తుంది’ అని ఐరాస అభివృద్ధి కార్యక్రమం కార్యాలయం డైరెక్టర్ పెడ్రో కాన్సెకావో పేర్కొన్నారు. ‘ఐహుకోణాల్లో పేదలు, ఘర్షణల సందర్భాలలో నివసిస్తున్న 45.5 కోట్ల మంది ప్రజలు, పోషకాహారం, నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, విద్య వంటి ప్రాథమిక అవసరాల విషయానికి వస్తే గణనీయంగా కఠినమైన లేమిని ఎదుర్కొంటారు. మరింత శాంతియుత పరిస్థితులలో నివసించే పేదరికంలో ఉన్నవారికంటే ఇది మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువ’ అని అసోసియేటెడ్ ప్రెస్‌కి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీఐ పేదరికం ఉన్న ప్రాంతాలను చూపుతున్నందున పేదరిక వ్యతిరేక ప్రయత్నాలను లక్ష్యం చేయవచ్చని ఆక్స్‌ఫర్డ్ ఇనిషియేటివ్ డైరెక్టర్ సబీనా అల్కిరే అన్నారు. ఉదాహరణకు, సైనిక జుంటా పాలనలో ఉన్న బుర్కినా ఫాసో తీవ్రవాదుల సమస్యను ఎదుర్కొంటోంది. అక్కడ జనాభాలో దాదాపు మూడింట రెండు వంతుల మంది పేదలు ఉన్నారని అల్కిరే చెప్పారు. పశ్చిమ ఆఫ్రికా దేశంలోని వివిధ ప్రాంతాలలో పేదరికం 21 శాతం నుంచి 88 శాతం వరకు ఉందని ఎంపీఐ చూపిస్తుంది. పాఠశాల హాజరు, పోషకాహారం, పాఠశాల విద్యలో కొరత పేదరికానికి ఎలా దోహదపడతాయో ఆమె వివరించారు.

# పాఠశాలలకు రూ.100 కోట్లు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రూ.100 కోట్లకుపైగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాఠశాలల్లో ప్రయోగశాలలు, ఇంటర్నెట్, నీరు, ఉపకరణాల కోసం ఖర్చు చేస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, అధికారులతో ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్చించిన తర్వాత నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకున్నారు. పాఠశాలల నిర్వహణ కోసం వ్యయప్రయాసలు భరించే ప్రధానోపాధ్యాయులకు ఉపశమనం లభించనుంది. ప్రతి పాఠశాలకు 50శాతం చొప్పున కాంపోజిట్ గ్రాంట్లు రెండు మూడు రోజుల్లో విడుదల చేయనున్నారు. కరోనా తర్వాత కాంపోజిట్ గ్రాంట్లను, మండల రిసోర్సు కేంద్రాల నిర్వహణ నిధులను గత ప్రభుత్వం విడుదల చేయలేదు. నిధులలేమితో పాఠశాలలు సమస్యల వలయాలుగా మారిన దుస్థితిని మంత్రి లోకేశ్ గుర్తించారు. 2024-25కిగాను మొత్తం 855 పాఠశాలలకు వార్షిక గ్రాంట్ల వినియోగం కింద రూ.8.63 కోట్లు, కేజీబీవీల్లో భోజన నిర్వహణ ఖర్చులకు రూ.35.16 కోట్లు, మండల రిసోర్సు కేంద్రాలకు రూ.8.82 కోట్లు కేటాయిస్తారు. కేజీబీవీలు, మిగిలిన 40,728 ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలకు రూ.51.90 కోట్లు స్కూల్ కాంపోజిట్ నిధుల్ని వెచ్చిస్తారు. ఈ నిధులు ఆయా పాఠశాలల నిర్వహణకు, నిరంతర అభివృద్ధికి, పాఠశాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలకు, విద్యుత్ చార్జీల చెల్లింపులు, సుద్దముక్కలు, డస్టర్లు, చార్టులు, పాఠశాల విద్యా సామాగ్రి, రిజిస్టర్లు, రికార్డులు తదితర స్టేషనరీ కొనుగోలు చేయడానికి కేటాయించారు. పాడైన పాఠశాల సామాగ్రి, వినియోగపడని క్రీడాసామగ్రి బాగుచేయడానికి నిధులను అందుబాటులోకి తెచ్చారు.

# ఇది దోపిడీ ప్రభుత్వం

## మాఫియా చేతుల్లో ఇసుక, మద్యం

### వైసీపీ అధినేత జగన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు అవుతున్నప్పటికీ చేసిందేమీ లేదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) జరగలేదని ఉన్నదల్లా దోచుకో.. పంచుకో..తినుకో (డీపీటీ) మాత్రమేనని జగన్ ఎద్దేవా చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఇసుక, మద్యం విధానం, ప్రస్తుతం అమలు చేస్తున్న తీరును గణాంకాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జగన్ వివరించారు. ఈ ఐదు నెలల్లో ఎక్కడా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని మండిపడ్డారు. వాటిపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని... కనీసం వార్షిక బడ్జెట్ కూడా ప్రవేశపెట్టకుండా ఓట్ ఆన్ అకౌంట్‌తో నడిపిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా ఇలా ఉండదేమోనని అన్నారు. ఎవరైనా మైనింగ్ చేసుకోవాలన్నా... పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నా... కప్పం కట్టనిదే ఏ ఒక్కరూ ఏ పని చేయలేని పరిస్థితి అని తెలిపారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని, ఇంట్లో ప్రతి చదువుకునే పిల్లలకు రూ.15వేలు ఇస్తామని దగా చేశారన్నారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితిలో ఉందని మాట మారుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోదాదాపు 141 నియోజకవర్గాలలో లారీ ఇసుక ధర రూ.20 వేలు, మరో 53 నియోజకవర్గాలలో లారీ ఇసుక రేటు సగటున రూ.30 వేలకు పైగా ఉందన్నారు. ఇంకొన్ని నియోజకవర్గాల్లో లారీ ఇసుక ధర ఏకంగా రూ.60 వేలకు పైగానే ఉందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం స్టాక్ యార్డుల్లో 80 లక్షల టన్నుల ఇసుక పెడితే... కూటమి ప్రభుత్వం రాగానే నెల రోజులు తిరక్కముందే అడ్డగోలుగా దోచేశారని ఆరోపించారు. ఇసుక టెండర్లకు కేవలం 2 రోజుల్లోనే 108 రీచ్‌లకు టెండర్లు పిలిచి. ముగించేశారని, ఇలా ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఒక మాఫియాలా మారి, ప్రభుత్వ కనుసన్నల్లో తమ వారి చేత దోచేసే కార్యక్రమం కాకపోతే మరేంటని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఏటా ప్రభుత్వానికి రూ.750 కోట్లు ఆదాయం వచ్చేలా, పారదర్శకంగా, ఈ-టెండర్ల ద్వారా, కేంద్ర ప్రభుత్వ ప్లాట్‌ఫామ్‌ల మీద టెండర్లు పిల్చామని గుర్తుచేశారు. మద్యంలో పెద్దఎత్తున దోపిడీ జరుగుతోందని, ప్రభుత్వానికి ఆదాయం తగ్గించి, డిస్టిలరీలకు మాత్రం వ్యాపారం పెంచి, దుకాణాలన్నీ తమ మాఫియాకే కేటాయించారని మండిపడ్డారు. చంద్రబాబు రూ.99కే మద్యం ఇస్తామని చెప్పారని... ఇది కూడా మరో కుంభకోణమేనని ఆరోపించారు. స్కిల్ కుంభకోణంపై అబద్ధాలకు రెక్కలు కట్టి ప్రచారం చేస్తున్నారని జగన్ తప్పుపట్టారు. విజయవాడ వరద సాయంలోనూ పెద్ద కుంభకోణం జరిగిందని, ఈ దారుణమైన అంశాలను రాసిందని సాక్షి సంపాదకులపై కేసు నమోదు చేశారన్నారు. అంటే వీళ్లు ఏం చేసినా ఎవరూ ప్రశ్నించకూడదా?, ఎవరూ మాట్లాడకూడదా? అని జగన్ అన్నారు. అనంతరం మీడియా ప్రశ్నలకు జగన్ బదులిస్తూ... అధికారంలో ఉన్నప్పుడు ఏ తప్పయినా చేయవచ్చన్న దృక్పథంతో ఇష్టం వచ్చినట్లు చేస్తే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. మద్యం మాఫియా, ఇసుక కుంభకోణాలపై వైసీపీ ప్రజల తరుఫున పోరాడుతుందన్నారు. ఈవీఎంలకు సంబంధించి మా పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని, ఇప్పటికే వైసీపీ కోర్టులో వేసిన కేసులున్నాయని జగన్ స్పష్టంచేశారు.

# ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?

## సీఎం చంద్రబాబుకు షర్మిల పోస్టుకార్డు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు అంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. విజయవాడ బస్టాండ్ నుంచి తెనాలి వెళ్లే పల్లెవెలుగు బస్సులో శుక్రవారం ఆమె ప్రయాణించారు. మహిళా ప్రయాణికుల పక్కన కూర్చుని ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలంటూ ఆమె నినదించారు. బస్సులో టికెట్ కొని ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి అమలు చేస్తారని సూటిగా ప్రశ్నించారు. ఉచిత ప్రయాణం అమలు చేయాలని సీఎం చంద్రబాబుకి పోస్ట్ కార్డు రాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి నాలుగు నెలలు అయిందని, అయినా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నారని, తెలంగాణలో వారంలో అమలు చేశారని, రాష్ట్రంలో పథకం అమలు చేయడానికి ఇబ్బందులు ఏమిటని, ఆర్టీసీకి డబ్బులు ఇవ్వాల్సి వస్తుందనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 20 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, రోజు వీరి ద్వారా రూ.ఏడు కోట్లు, నెలకు రూ.300 కోట్లు ఆదాయం వస్తుందని వివరించారు. ఉచిత ప్రయాణం కల్పిస్తే.. రూ.300 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాల్సి వస్తుందని భయమా అని నిలదీశారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల మద్దతు తీసుకుని, అనేక హామీలిచ్చి ఇప్పుడు మహిళల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయలేరా... మీ సూపర్ సిక్స్ హామీల్లో నాలుగు పథకాలు మహిళలవేనని చెప్పారు. పథకం అమలుకు ధైర్యం రావడం లేదా... మీకు ఇష్టం వచ్చినప్పుడు అమలు చేస్తారా... ఇంత చిన్న పథకం అమలు చేయనప్పుడు ఇక పెద్ద పథకాల సంగతి ఏమిటని ప్రశ్నించారు. మేనిఫెస్టోలో మహిళల కోసం పెట్టిన పథకాలు వెంటనే అమలు చేయాలని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబుకు పెద్దఎత్తున పోస్ట్ కార్డులు పంపుతామని షర్మిల పేర్కొన్నారు.

# 'బర్మా' భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వండి

## ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌కు వినతులు

**విశాలాంధ్ర - విశాఖ సిటీ:** రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖ చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం టీడీపీ జిల్లా కార్యాలయంలో 44వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బర్మా కాందిశీకుల భూములు అన్యాక్రాంతం చేస్తున్న వారు, అందుకు మద్దతిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, తమకు ఆయా భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని బర్మా ఆంధ్రా కాందిశీకుల కేంద్ర సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఎంపికైన ఆర్టీసీ డ్రైవర్లు... తమను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ రీజియన్‌లో 2013లో ఎంపికైన తమను... 2022లో విధుల్లోకి తీసుకున్నారని, దీంతో సర్వీసు చాలా నష్టపోయామని మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకున్నారు. విశాఖ సమీపంలోని భీమునిపట్నంలో మొత్తం నగదు చెల్లించి కొనుగోలు చేసిన 78 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వైసీపీ అండతో అక్రమాని వెంకటరావు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, విచారించి తగిన న్యాయం చేయాలని నకేళ్ల సోమరాజు విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ పాలనలో చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ వార్త విని తన భర్త గుండెపోటుతో మరణించాడని, దీంతో తమ కుటుంబానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కండపాలెంకు చెందిన ముచ్చకర్ల ధారాలక్ష్మి మంత్రిని కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. వడ్డాది కేజీబీవీలో ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు చేసిన తప్పునకు న్యాయం కోసం పడిగాపులు కాస్తున్నానని విశాఖ రూరల్‌కు చెందిన కే చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో ఉడా అనుమతులు ఉన్న 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, 1981లో సొసైటీకి దాఖలైన సదరు భూమిని 35 ఏళ్ల దర్వాత నిషేధిత జాబితాలో చేర్చారని, ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన నగదును కుమార్తెల వివాహం కోసం అగ్రిగోల్డ్‌లో పొదుపుచేశానని, సంస్థ బోర్డు తిప్పేయడంతో రోడ్డున పడ్డామని శ్రీకాకుళానికి చెందిన గంగాడ కొర్లమ్మ లోకేశ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, ఎంబీఏ చదివిన కొంతమంది నిరుద్యోగులు తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి పత్రాలను అందజేశారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన తనకు రేషన్ దుకాణం మంజూరు చేసి ఆదుకోవాలని కంచరపాలెంకు చెందిన మోర్ల రాజారావు కోరారు.

# మద్యం దుకాణాలు ఆదివాసీలకు కేటాయించాలి : సీపీఎం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టం నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, మద్యం దుకాణాలు స్థానిక ఆదివాసీలకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ మద్యం దుకాణాల లబ్ధిదారుల ఎంపిక, దుకాణాల ఏర్పాటుపై ప్రభుత్వ నోటిఫికేషన్‌ను అనుసరించి గిరిజనేతరులు, స్థానికేతర గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారని, గిరిజనేతరులు సిండికేట్లుగా ఏర్పడి తెలంగాణ రాష్ట్రం, సరిహద్దు జిల్లాల నుంచి దుకాణాలను దక్కించుకున్నారని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 దుకాణాలకుగాను దాదాపు 2,200 దరఖాస్తులు వచ్చాయని, దుకాణ లబ్ధిదారుల ఎంపిక విషయంలో పెసా చట్టం నిబంధనలను ఉల్లంఘించారని, ఏజెన్సీ చట్టాలను ప్రభుత్వం గౌరవించలేదని పేర్కొన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారం, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక న్యాయ, మతపరమైన పద్ధతులు, సామాజిక వనరుల నిర్వహణ, పరిరక్షణ, సాంప్రదాయ పద్ధతులలో వివాదాల పరిష్కారం, మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం, రద్దు చేయడం, అంతిమ అధికారాలు పెసా గ్రామసభకే ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులను గ్రామసభకు తెలియపర్చడంతో పాటు మద్యం దుకాణాల విషయంలో గిరిజనులకు లైసెన్స్ గ్రామసభ పరిధిల్లోనే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# అమరావతి డ్రోన్ సదస్సుపై సీఎస్ సమీక్ష

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఈనెల 22, 23వ తేదీల్లో మంగళగిరి సికె కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సదస్సు 2024 ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జాతీయ స్థాయి డ్రోన్ సదస్సు కావడంతో ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అమరావతి డ్రోన్ సదస్సులో 5,500కు పైగా డ్రోన్లను వినియోగించనున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లను స్పెషల్ చీఫ్ సెక్రటరీ సురేష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. 14 రకాల ఇతివృత్తాలతో డ్రోన్ సదస్సును నిర్వహించనున్నారు. 22వ తేదీ జరిగే డ్రోన్స్ జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సభలో వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా. 22న సాయంత్రం కృష్ణా తీరం పున్నమీ ఘాట్‌లో 5 వేల డ్రోన్లతో మెగా షో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్ కుమార్, వర్చువల్‌గా ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు విజయవాడ పోలీసు కమిషనర్, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా ఏపీ బీజేపీ నేతలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఆంధ్ర ప్రదేశ్ చెందిన అనేక మంది బీజేపీ నేతలకు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. నాందేడ్ పరిశీలకుడిగా విష్ణువర్ధన్ రెడ్డి, నాసిక్ పరిశీలకునిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను నియమించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధుకర్‌ను మరఠ్వాడాలోని మూడు ప్రాంతాలకు పరిశీలకులుగా పార్టీ నియమించింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే నాందేడ్ ప్రాంతానికి పరిశీలకుడుగా వెళ్లిన ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

# పీజీ స్పాట్‌లో డిగ్రీ అభ్యర్థులకు అవకాశం

## జాన్సన్‌బాబు డిమాండ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పీజీ కోర్సుల స్పాట్ అడ్మిషన్లలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారికీ అవకాశం కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పాట్ అడ్మిషన్లలో పీజీ సెట్-2024కు సంబంధం లేకుండా, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి అవకాశం కల్పిస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాల కళాశాలల్లో పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకిగాను శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, ఈ ప్రవేశాల్లో ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులకే అవకాశం కల్పించారని తెలిపారు. దీనివల్ల డిగ్రీ ఉత్తీర్ణులై... పీజీ కోర్సులు చేయాలని ఆసక్తి వున్న విద్యార్థులకు విలువైన విద్యా సంవత్సరాన్ని నష్టపోతారని పేర్కొన్నారు. ఇప్పటివరకు చాలా విభాగాల్లో 50 శాతం సీట్లు భర్తీకి నోచుకోలేదని, దీనివల్ల భవిష్యత్తులో చాలా విభాగాలు మూసివేసే పరిస్థితి వస్తుందన్నారు. మిగిలిన సీట్లలో పీజీ ప్రవేశాలకుగాను పీజీ సెట్‌లో అర్హత సాధించిన వారితోపాటు డిగ్రీ ఉత్తీర్ణులైన వారందరికీ పీజీ కోర్సులు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. పాలక మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువుకు దగ్గరవుతారని, విశ్వవిద్యాలయాలు బలోపేతం అవుతాయన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్, ఆంధ్ర యూనివర్సిటీ, శ్రీకృష్ణదేవరాయలు, రాయలసీమ, యోగివేమన, కృష్ణా, నాగార్జున తదితర విశ్వవిద్యాలయాల్లో డిమాండ్ గల కోర్సుల్లో చేరేందుకు మంచి అవకాశం కల్పించినట్లు అవుతుందని సూచించారు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి...పీజీ స్పాట్ అడ్మిషన్లలో పీజీ సెట్ అర్హత పొందిన వారితోపాటు డిగ్రీ ఉత్తీర్ణులైన వారికీ అవకాశం కల్పించాలని కోరారు.

# ఉపాధ్యాయులపై పనిభారం తగ్గిస్తాం

- విద్యాశాఖ కమిషనర్ హామీ
- ఉపాధ్యాయ సంఘాలతో కీలక భేటీ
- జీవో 117లో మార్పులు చేస్తామని వెల్లడి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన జీవో నంబరు-117 మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పష్టంచేశారు. తాడేపల్లి విద్యాభవన్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అధ్వర్యంలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. విద్యాశాఖ సంచాలకులు ప్రసన్నకుమార్‌తోపాటు అదనపు సంచాలకులు సుబ్బారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్టీయూతోపాటు అన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి రాత పూర్వకంగా వినతులను ఆయన స్వీకరించారు. మూడు, నాలుగు ఐదు తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకునే పక్షంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిగే ఇబ్బందులు, తల్లిదండ్రులు నుంచి వచ్చే అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రతి మేజర్ గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుపై చర్చించారు. ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరగా... పనిభారంతోపాటు యాప్‌లను వీలైనంత వరకు సరళీకరించి ఇబ్బంది లేకుండా చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. నవంబర్ 11న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేస్తామని, 14న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవ సమావేశానికి సీఎం చంద్రబాబుతోపాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని కమిషనర్ పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని, ఇక నుంచి రెండు నెలలపాటు ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో ఒక్కో అంశంపై చర్చించి అభిప్రాయాలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే శుక్రవారం ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఉంటుందన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు అన్ని పరిష్కారమై విద్యార్థుల విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టేలా కమిషనర్ ప్రయత్నించాలని సంఘాల నేతలు కోరారు. జీఓ నంబరు-117 అమలుతో ఎదురైన ఇబ్బందుల్ని పరిష్కరించాలని, ప్రాథమిక పాఠశాలలు 1 నుంచి 5 తరగతుల వరకు నిర్వహించాలని, వీటికి అనుబంధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 ప్రాతిపదికన ఉపాధ్యాయులను కేటాయింపు తదితర డిమాండ్లతో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

# నూతన విధానాలతో యువతకు ఉపాధి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్ర యువత ఆకాంక్షల మేరకు స్థిరమైన ఉపాధి అవకాశాల కల్పనకు ఏపీ ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తోందని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో సెక్టార్ స్కిల్ కౌన్సిల్, అగ్రికల్చర్ ఏవియేషన్ అండ్ ఏరోస్పేస్, అపెరల్, టెక్స్‌టైల్స్ సీఈఓలతో సీడాప్ (ఎస్ఇఇడీఏపీ) శుక్రవారం సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా దీపక్ రెడ్డి ప్రసంగిస్తూ ఏపీని ఎంచుకున్న పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా నిలిచేందుకు క్రియాశీల విధానంతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ప్రభుత్వ నూతన విధానాలు రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించబోతున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి పథకాలను అమలు చేయడంలో సీడాప్ విజయవంతమైన ట్రాక్ రికార్డు ఉందని సీడాప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని చెప్పారు. వ్యవసాయ కార్యకలాపాలలో వివిధ స్థాయిలలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడంపై శిక్షణా గురించి చర్చించారు. సదస్సులో డాక్టర్ సాంబయ్య, డాక్టర్ సతేందర్ సింగ్ ఆర్య, సాధిక్, టి కవిత, విఘ్నేష్ రాజా, శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టులో సజ్జల క్వాష్ పిటిషన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తనకు ఇచ్చిన లుక్ అవుట్ నోటీసులను (ఎల్ఓసీ) క్వాష్ చేయాలని శుక్రవారం రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తనకు తనకు ఎల్ఓసీ ఇవ్వడంపై కోర్టు ధిక్కరణ కింద క్వాష్ పిటిషన్‌ను సజ్జల వేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో సజ్జల పాత్రపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్ తదితరులకు నోటీసులు ఇచ్చారు. ఇటీవల సజ్జలకూ ఇదే కేసులో నోటీసులు ఇవ్వగా, మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

# పోలీసు కస్టడీకి మాజీ ఎంపీ సురేశ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధిస్తూ మంగళగిరి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన మహిళ హత్య కేసులో రిమాండ్ ఖైదీగా నందిగం సురేశ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజులపాటు సురేశ్‌ను పోలీస్ కస్టడీలో విచారిస్తారు. 2020లో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్న ఘటనలో మరియమ్మ అనే మహిళ మృతి చెందారు. ఈ కేసులో నిందితుడిగా సురేశ్‌ను చేర్చడంతో ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు.

# కందిపప్పు సరఫరాదారులపై నాదెండ్ల ఆగ్రహం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సబ్సిడీ ధరలపై పేదప్రజలకు కందిపప్పు సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి సరఫరా దారులు సహకరించకపోవడంపై రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసహనం వ్యక్తం చేశారు. టెండర్లలో ఉన్న తరహాగా పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా చేయాలని, నాణ్యమైన కందిపప్పు సరఫరా చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర పౌర సరఫరాల భవన్‌లో శుక్రవారం వంటనూనె దిగుమతిదారులు, కందిపప్పు సరఫరా దారులతో మంత్రి నాదెండ్ల సమావేశమయ్యారు. సబ్సిడీ సరుకులు అందించేందుకు వంట నూనె దిగుమతి దారులు సహకరించాలని కోరారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు భారీ ఊరట కల్పించిందని, పెరిగిన ధరల నుంచి ప్రజలను ఉపశమనం కల్పించేందుకు తక్కువ ధరకే వంట నూనెను అందించాలని నిర్ణయం తీసుకుందని చెప్పారు.అందులో భాగంగా పామాయిల్ లీటరు రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124 ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో వంట నూనెల ధరలు పెరిగే అవకాశముందన్న ప్రచారం జరుగుతుందని... సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కందిపప్పు సరఫరా విషయంలో జరిగిన జాప్యంపై సరఫరా దారులు చెప్పిన అంశాలను మంత్రి తోసి పుచ్చారు. ఈ సమావేశంలో పౌర సరఫరాలశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఎండీ మనజీర్ జిలాని పాల్గొన్నారు.

# కోరిక తీర్చలేదని కోడలిని చంపిన మామ

**విశాలాంధ్ర-నందికొట్కూరు:** వావి వరసలు మరిచి కూతురులాంటి కోడలిపై కామం పెంచుకున్నాడో మామ. కాదన్నందుకు ఆమెను కిరాతకంగా చంపేశాడు. ఈ దారుణం నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం, నాగటూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న మొక్కజొన్న పొలంలో కంకులు ఏరడానికి వెళ్లిన కోడలు శిరీష (25)పై కన్నేశాడు మామ గొల్ల కురుమన్న. ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. శిరీష అడ్డుతిరిగింది. దీంతో బండరాయితో మోదీ ఆమెను హత్య చేశాడు. ముఖాన్ని నుజ్జునుజ్జు చేసి పరారయ్యాడు. ఉదయం పొలానికి వెళ్లిన శిరీష సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించింది. గ్రామస్తుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శిరీష హత్యకు గురైనట్లు తెలిసి మృతదేహాన్ని చూసేందుకు గ్రామ ప్రజలు బారులు తీరారు. శిరీష స్వగ్రామం జూపాడుబంగ్లా మండలం. దాదాపు 12 ఏళ్ల కిందట నాగటూరుకు చెందిన నరసింహాతో ఆమెకు పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నందికొట్కూరు అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. హత్య చేసింది మామ అని గుర్తించి అతని కోసం గాలింపులు చేపట్టారు.

సంపాదకీయం

# అవసరార్థం అంబేద్కర్

**భా**రతీయ జనతా పార్టీ అవారసత్వం స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి నుంచి వచ్చింది కానందువల్ల మోదీ నాయకత్వంలో పదేళ్ల కింద కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరవాత బీజేపీ తన వారసత్వ మూలాలను జాతీయోద్యమంతో ముడి వేయడానికి ప్రయత్నించింది. భారత రాజ్యాంగం మీద బీజేపీకి, దాని పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్‌కు ఈ రెండు రాజకీయ పార్టీలకు స్ఫూర్తినిచ్చే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)కు ఎన్నడూ ఇసుమంత అభిమానం కూడా లేదు. కానీ వచ్చే నెలలో మహారాష్ట్ర శాసనసభకు జరగాల్సి ఉన్న ఎన్నికలు ఆ రాష్ట్రంలోని బీజేపీ నాయకుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనను, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని చీల్చి మాయోపాయంతో ఈ చీలిక వర్గాల దన్నుతో బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామి కాగలిగింది. శివసేనను చీల్చి వచ్చిన ఏక్‌నాథ్ షిండేకు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టినా వెనక నుంచి మంత్రాంగం నడిపేది ఉప ముఖ్యమంత్రి పదవితో సంతృప్తి పడవలసి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి ఫడ్నవీసే. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో మహారాష్ట్రలో బీజేపీ ఇది వరకటి కన్నా తక్కువ సీట్లు సంపాదించింది. ఏక్ నాథ్ షిండే నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల మన్నన పొందలేక పోయింది. ఎన్.సి.పి.ని చీల్చి వచ్చిన అజిత్ పవార్‌లో ఇప్పటికీ ఊగిసలాటే కనిపిస్తోంది. గత లోకసభ ఎన్నికలలో భార్యనే గెలిపించుకోలేక పోయాడు. ఈ సూచనలన్నీ శాసనసభ ఎన్నికలలో ప్రస్తుతం షిండే నాయకత్వంలోని మహాయుతికి ప్రతికూలంగానే ఉంది. గెలుపు ఓటముల ప్రభావం షిండే, అజిత్ పవార్ నాయకత్వంలోని పార్టీలను పెద్దగా ఇబ్బంది పెట్టకపోవచ్చు కానీ దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబై మహానగరం ఉన్న మహారాష్ట్రలో తిరుగులేని పట్టు సంపాదించలేకపోతే ఆ ఓటమి భారమంతా బీజేపీ నాయకుడైన దేవేంద్ర ఫడ్నవీస్ మోయాల్సి వస్తుంది. ఆ తరవాత ఆయన రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్థకం కావచ్చు. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని పడగొట్టడం అప్పుడు బీజేపీకి అవసరం అయి ఉండొచ్చు. కానీ శాసనసభ ఎన్నికలలో ఎలాగోలా విజయం సాధించి పట్టు నిలుపుకోవడం బీజేపీకి చాలా అవసరం. అధికార కాంత చేలాంచలాలు పట్టుకు తిరగడంలో బీజేపీ ఆరితేరి పోయింది. ఎప్పటికి ఏ వేషం వేసుకోవలసి వస్తే ఆ వేషం వెయ్యగల నైపుణ్యం అపారంగా సంపాదించేసింది. అయితే ఇది ఒక్కటే చాలదు. దానికి ఓ సైద్ధాంతిక పునాదీ అవసరం. ఈ పునాది తమ అసలు సైద్ధాంతిక పునదితో ఏ మాత్రం పొసగకపోయినా నీట మునిగిపోతున్న వాడికి ఉలిపికట్టె కూడా ప్రాణ రక్షణకు మహోపాయం అనిపిస్తుంది. అందుకే దేవేంద్ర ఫడ్నవీస్ రాజ్యాంగం మీద ఎక్కడ లేని ప్రేమ కురిపిస్తున్నారు. రాజ్యాంగం తమకు శిరోధార్యం అని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. ఫడ్నవీస్ రాజ్యాంగానికి, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ కు మొకరిల్లుతున్న పోస్టర్లు మహారాష్ట్రలో విస్తృతంగా దర్శనమిస్తున్నాయి. రాజకీయ తంత్రం ఎరిగిన బీజేపీ నాయకుడు ఫడ్నవీస్ అమాంతం ప్లేటు ఫిరాయించి రాజ్యాంగం మీద, అంబేద్కర్ మీద అపారమైన గౌరవ విశ్వాసాలున్నట్టు నమ్మించడానికి చేస్తున్న ప్రయత్నాలను ఒక పిసరు అనుమానించక తప్పదు.

రాజ్యాంగ రూపకల్పన పూర్తి అయిన సందర్భంగా రాజ్యాంగ నిర్ణాయక సభలో 1949 నవంబర్ 25న అంబేద్కర్ చేసిన ఆఖరి ప్రసంగంలో రాజ్యాంగ విశిష్టతను నొక్కి చెప్తూనే పొంచి ఉన్న ప్రమాదం గురించి ఊహించి హెచ్చరించారు. ఇది చాలా విశిష్టమైన రాజ్యాంగం అయినా దీన్ని అమలు చేసే తీరు మీదే దాని ప్రయోజనం పదిలంగా ఉంటుందని చెప్పారు. రాజ్యాంగం అమలులోకి వచ్చే రోజైన 1950 జనవరి 26 నుంచి మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉంటాం. అంటే ప్రజలు తమ కోసం తాము ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వం, తామే నడుపే ప్రభుత్వం, ప్రజలకోసం ఉద్దేశించిన ప్రభుత్వం ఏర్పడే మాట నిజమే అని ఆయన అన్నారు. ఆ వెంటనే "కానీ రాజ్యాంగం భవిష్యత్తు ఏమిటి అని ప్రశ్నించారు. అంటే రాజ్యాంగాన్ని మనం సంపూర్ణంగా కాపాడుకోలేక పోతామన్న అన్న అనుమానం అప్పటికే అంబేద్కర్ కు ఉంది. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోగలుగుతామా లేదా పోగొట్టుకుంటామా అని కూడా అంబేద్కర్ అనుమానం వ్యక్తం చేశారు. సరిగ్గా నాలుగు రోజుల తరవాత 1949 నవంబర్ 30నాటి ఆర్.ఎస్.ఎస్. అధికారిక పత్రిక ఆర్గనైజర్ పత్రికలో ఇదే సంఘ్ పరివార్ రాజ్యాంగం మీద భయంకరంగా దుమ్మెత్తి పోసింది. రాజ్యాంగంలో భారతీయత అనేది ఉదాహరణ ప్రాయంగా కూడా లేదని దెప్పి పొడిచింది. రాజ్యాంగ నిర్మాతలు మనుస్మృతిలో చెప్పిన సూత్రాలను రాజ్యాంగంలో చేర్చడంలో విఫలమయ్యారని విమర్శించింది. అంటే సంఘ్ పరివార్ దృష్టిలో మనుస్మృతే మనకు రాజ్యాంగం కావాలి. చాలా కాలం దాకా ఆర్.ఎస్.ఎస్. భారత జాతీయ పతాకాన్నే గుర్తించలేదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల సమయంలో "అబ్కీ బార్ 400 పార్" అన్న మోదీ నినాదంతో మంత్రముగ్ధులైన వారు తమకు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తున్నామని చెప్పారు. అంతెందుకు మర్యాదస్థుడు అనుకునే అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే రాజ్యాంగాన్ని పునర్లిఖించాలన్న ప్రయత్నాలు కూడా జరిగాయి. దానీ కోసం న్యాయమూర్తి వెంకటాచలయ్య నేతృత్వంలో ఒక కమిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ నివేదిక కూడా సమర్పించింది. కానీ "భారత్ వెలిగిపోతోంది" అన్న ప్రచారాన్ని విపరీతంగా నమ్మేసిన బీజేపీ 2004 ఎన్నికలలో బోల్తా పడింది. కానీ 2014లో మోదీ నాయకత్వంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో జాతీయ పోరాటంలో తమకు లేని స్థానాన్ని భర్తీ చేసుకోవడానికి, నెహ్రూకు బదులు సర్దార్ పటేల్ తొలి ప్రధానమంత్రి అయిఉంటే ఎంతబాగుండేది అని మోదీ నాయకత్వంలో భారీ ప్రచారం జరిగింది. పనిలో పనిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను కూడా ఆర్.ఎస్.ఎస్. సొంతం చేసుకోవాలని ప్రయత్నించింది. రాజ్యాంగం మీద ఎనలేని భక్తి ప్రపత్తులు ప్రదర్శించి జనాన్ని మోసం చేయాలని ప్రయత్నించింది. 2015 గణతంత్ర దినోత్సవాల సందర్భంగా పత్రికల్లో విడుదల చేసిన వ్యాపార ప్రకటనల్లోంచి "రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్ట్ అన్న మాటలను మినహాయించేసింది. అదేమంటే మేము తొలి రాజ్యంగా ప్రతి తీసుకున్నాం అని చెప్పారు. అమలులో ఉన్న రాజ్యాంగం అంటే లెక్కలేనట్టుగా ప్రవర్తించడంలో భాగమే ఇది. దేవేంద్ర ఫడ్నవీస్ కు ఇప్పుడు హఠాత్తుగా రాజ్యాంగం గుర్తొచ్చింది. అంబేద్కరూ గుర్తు వచ్చారు. ఎన్నికల పబ్బం గడుస్తుందనుకుంటే బీజేపీ ఎన్ని రాజీలకైనా సిద్ధం అవుతుంది. ఎన్ని ఉడుపులైనా మారుస్తుంది. ఈ కుహనా ప్రచారానికి బలి కాకుండా ఉండాల్సింది మహారాష్ట్ర ప్రజలే.

## అతను... పంటకాలువలా చుట్టేశాడు

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

"**అ**మరుడయ్యాడను..
ఆకాశ తార అవుతాడను
ఒక మనిషి మరణించడమంటే
మానవత్వం ఊపిరి బిగపట్టడం"

ఈ కవితా పంక్తులు రాసింది నా అభిమాన కవి వరవరరావు. ఇదిగో, నాలుగు రోజుల క్రితం సికింద్రాబాద్ మౌలాలీ ప్రాంతానికి వచ్చిన జన సమూహాన్ని చూస్తే వారంతా ఊపిరి బిగపట్టినట్లుగానే కనిపించింది. సాయిబాబా లేరని తెలిసి వారందరి పొళ్లు పిడికిలైనట్లుగా కనిపించింది. గత పదేళ్లుగా సాయిబాబా పడిన వేదన మనకి ఎవరు చెబుతారు. ఆయన జీవితానికి సమస్తమూ తానే అయిన ఆ వీల్ చైయిర్ తప్ప. ఆ మూడు చక్రాలు సాయిబాబా మారిన స్థితిగతులను వివరిస్తాయా... ఇప్పుడంటే న్యాయదేవత కళ్లకు కట్టిన గంతలను తొలగించారని వార్తలు వస్తున్నాయి కానీ, ఆ కళ్లకు కానరాకుండా సాయిబాబాపై నెరపిన కుట్రలను ఎవరు మాత్రం బహిరంగ పరచగలరు. ఎంత ఆశ్చర్యం. వచ్చని ప్రకృతి మధ్య, ఆకలి అనే పదం వినిపించడానికి అవకాశంలేని ప్రాంతం నుంచి, పోరాటాలు, ఉద్యమాల వంటి మాటలు వినిపించని కోనసీమ నుంచి అన్నార్తుల కోసం, దేశ ప్రజల అద్భుత భవితవ్యం కోసం ఓ యువకుడు తాను నమ్మిన సిద్ధాంతంకోసం పనిచేశారంటే ఎలా నమ్మగలం. అవును, కోనసీమ అంటే ఎలాంటి విప్లవ రాజకీయాలు లేని, రాలేని ప్రాంతమని ఇన్నాళ్లు భావించాను. మహాకవి శ్రీశ్రీ తన మహాప్రస్థానాన్ని అంకితమిచ్చిన కొంపెల్ల జనార్ధనరావు కోనసీమ వాసే. అందునా ఇదిగో ఈ సాయిబాబా చదువుకున్న కాలేజీకి అతి సమీప నివాసే అని తెలుసు. అలాగని కోనసీమకు ఏ బాదర బందీలు లేవా అంటే లేవని కాదు కానీ... ఇలా ప్రజల గురించి ఆలోచించే వామపక్ష భావజాలపు ఆనవాళ్లు మాత్రం పెద్దగా కనిపించని ప్రాంతం ఇది.

అదిగో అలాంటి కోనసీమ నుంచి వచ్చిన ప్రొఫెసర్ సాయిబాబా ఇప్పుడు అంతర్జాతీయ వార్త అయ్యారు. ప్రజలకు మంచి బోధించే ప్రొఫెసర్ అయ్యారు. తన శరీరాన్ని భవిష్యత్ తరాల వైద్యులకు అప్పగించి ఓ ప్రయోగంగా మిగిలారు. అతని నిష్క్రమణ తర్వాత ప్రజల్లో ఇంత ఆవేశం ఉందా...! ఏలికల మీద ఇంత ఆగ్రహం ఉందా...! తమ బతుకులు బాగుపరిచే వారి పట్ల ఇంత ప్రేమ ఉందా..! అనిపించింది.
సికింద్రాబాద్‌లోని ఓ మూలకు విసిరేసినట్లుగా ఉండే మౌలాలి నుంచి గాంధీ ఆసుపత్రి వరకూ సాగిన సాయిబాబా అంతిమయాత్రలో జనం సముద్రం కావడం చూశాను. చావుని నిరాకరించిన వారి గురించి ఇంత ప్రేమను మోసుకొస్తారా వారసులు అనిపించింది. అవును, "మొలకెత్తే గడ్డి సవ్వడులు" వినడం ఇష్టమైన సాయిబాబాకి చావుని నిరాకరించడం ఎంత తేలికో అతడ్ని చూస్తేనూ, చదివితేనూ అర్థం అవుతుంది.

తనని బంధించిన వారిని, ఆ బందిఖానాకు కాపలాగా ఉన్న వారిని కూడా ప్రేమించే అతి సున్నితమైన సాయిబాబా ఇక కనిపించరంటే... మనం సరే, ఐదు దశాబ్దాలపాటు తనతోటే నడిచిన ఆ మూడు చక్రాల వీల్ చైయిర్ కన్నీరు కార్చకుండా ఎలా ఉంటుంది. వెక్కి వెక్కి ఏడ్చే ఉంటుంది ఆ జైలు కాపలాదారు రూపంలో... ఎందుకంటే "వెచ్చగా తాకే ప్రభాత కిరణంలా/ నా పంజరంలోకి వచ్చి / పంట కాలువలా చుట్టేసే" ఆ జైలు గార్డుకు సలాం చెప్పారు కదా తన కవిత్వంతో ఈ సాయిబాబా. కరుకు బట్టల ఖాకీ అనుకుంటారు కానీ లోలోపల వారి సున్నితత్వం చూడడం ప్రజా కళాకారులకు మాత్రమే తెలుస్తుంది. అందుకే ఆనాడెప్పుడో ప్రజా యుద్ధనౌక గద్దర్ "మా లోని వాడివే నువ్వు పోలీసన్నా" అంటే ఇప్పుడీ సాయిబాబా కూడా "అతను ఎప్పుడూ నా పంజరానికి అతుక్కుపోయే ప్రేమఖైదీ/ బయటకి అతనొక శిల/ లోపల అతడొక నది" అన్నారు అతని జైలు గదికి కాపలా కాసిన ఓ పోలీసు. వ్యవస్థల్ని తప్ప వ్యక్తుల్ని ద్వేషించని మనిషి సాయిబాబా. బహుశా దానికి నిదర్శనమే అ మనిషిని చివరిసారిగా చూసేందుకు అన్ని వేలమంది అక్కడ జమ కూడారేమో...!

సాయిబాబా బతికి ఉండగా ఏం చేశారని ఇంతటి కఠిన శిక్షలు అనుభవించారు. ఆయనే అన్నట్లు "విశ్వవిద్యాలయాల్లో నా చైతన్యయుత జీవితమంతా ప్రేమ, జ్ఞానం, స్వేచ్ఛల అన్వేషణలో నేర్చుకుంటూ, నేర్పుతూ గడిపాను. సమాజం మూగబోవడం చూశాను. ఆ మౌనాన్ని ఛేదించాలని ప్రయత్నించాను" అన్నారు సాయిబాబా తన నేను చావును నిరాకరిస్తున్నాను కవిత్వ సంపుటిలో... ఆయన వెళ్లిపోతూ మరో మాట కూడా అన్నారు. "నాకు సానుభూతి మీద నమ్మకం లేదు... సంఘటితం మీద తప్ప" అన్నారు. అంతే కాదు... ఇది ఐదున్నర దశాబ్దాల సాయిబాబా కథ కాదు.... దేశంలో అందరి కథా... ఇదీ ఆయనే అన్నారు. ఇది చదివాక నాకు అనిపించింది.

సాయిబాబా పుట్టుక ఒంటరి... మరణ ధిక్కారం సామూహికం.

సీనియర్ జర్నలిస్టు
సెల్:99120 19929

# రేపిస్టులు, హంతకులకు సన్మానాలా?

ఎం కోటేశ్వరరావు

**తా**ను పక్కా సనాతనవాదినంటూ పవన్ కల్యాణ్ ఊగిపోతూ చెప్పారు, చెబుతూనే ఉంటారు. ఎందుకంటే సనాతనవాదం పులి స్వారీ వంటిది. ఒకసారి పులినెక్కిన వారు అది ఎక్కడికి తీసుకుపోతే అటు పోవాల్సిందే. ఊహలు, కంప్యూటర్ గ్రాఫిక్స్, సినిమాలు, సాహిత్యంలో తప్ప చరిత్రలో పులిని అదుపుచేసిన వారు ఎవరూ లేరు. పవన్ కల్యాణ్ ప్రస్తానం ఎలా ఉంటుందో చూద్దాం. వారాహి ప్రకటన సందర్భంగా చేసిన సనాతన విన్యాసాలమీద సామాజిక మాధ్యమంలో అనేక మంది అంతకంటే ఎక్కువగా స్పందించి చీల్చి చెండాడుతూ సంధించిన ప్రశ్నలకు ఎక్కడా సమాధానం రాలేదు. బహుశా ఇలా జరుగుతుందని అనుకొని ఉండరు. భావజాల పోరులో ఎదుటి వారి మీదికి బంతిని ఎంత వేగంగా విసిరితే అంతే వేగంగా తిరిగి వస్తుంది. తగ్గేదేలేదని చరిత్ర నిరూపించింది. సనాతన ధర్మమునందు విడాకులు లేవు అంటూ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చెప్పిన మాటలను-పవన్ కల్యాణ్ సుభాషితాలను కలిపిన ఒక పోస్టు సామాజిక మాధ్యమంలో తిరుగుతోంది. దాన్ని తనకు వర్తింప చేసుకొని ఎలా సమర్ధించుకుంటారో తెలియదు.

పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి వ్యతిరేకంగా మాట్లాడిన వారి మీద విరుచుకుపడిన మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటుండగానే సనాతనులకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని చెప్పుకొనేవారు చేసిన పనికి సభ్య సమాజం సిగ్గుపడింది. అఫ్‌కోర్సు వారిలో కట్టర్ హిందూత్వవాదులు ఉండరనుకోండి. ప్రముఖ జర్నలిస్టు, పురోగామివాది, హిందూత్వ వ్యతిరేకి అయిన గౌరీ లంకేష్‌ను కాల్చి చంపిన కేసులో నిందితులైన పరశురామ్ వాగ్మోరే, మనోహర్ యెదవే అనే వారిని కర్నాటక సనాతన లేదా హిందూత్వశక్తులు విజయపురాలో ఈ నెల 11న సన్మానించాయి. గౌరీ లంకేష్‌ను 2017 సెప్టెంబరు ఐదవ తేదీన కాల్చిచంపారు. బెంగళూరు సెషన్స్ కోర్టు అక్టోబరు తొమ్మిదవ తేదీన జారీ చేసిన ఆదేశాల మేరకు ఎనిమిది మంది నిందితులకు బెయిలు మంజూరు చేసింది. దీంతో మొత్తం 18 మందిలో 16 మంది బెయిలుమీద బయటకు వచ్చారు. మిగిలిన ఇద్దరిలో శరద్ కలాస్కర్ అనే వ్యక్తి మహారాష్ట్ర హేతువాది నరేంద్ర దబోల్కర్ హత్యకేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న కారణంగా లోపలే ఉన్నాడు. వికాస్ పాటిల్ అనే వ్యక్తిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. పైన పేర్కొన్న ఇద్దరు నిందితులు కన్నడ పత్రిక వార్తా భారతి కథనం ప్రకారం తమ స్వస్థలం విజయపుర వెళ్లినపుడు కాళికాదేవి గుడిలో పూజలు చేశారు. సంఘపరివార్(ఆర్ఎస్ఎస్), శ్రీరామ్ సేన కార్యకర్తలు వారికి సన్మానం చేశారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన హిందూత్వ నేతలు వారిద్దరినీ ఆరేళ్లుగా అన్యాయంగా జైల్లో ఉంచారని, విజయదశమి సందర్భంగా వారిని విడుదల చేయటం సంతోషమని పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ ఈ వార్తను చదివారో లేదో తెలియదు. ఒకవేళ చదివినా ఆ కేసులోని వారు ఇంకా నిందితులే తప్ప నేరం రుజువు కాలేదుగా అని లా పాయింట్ తీసి "సనాతనుల"ను సమర్ధించవచ్చు. అందుకే మరికొన్ని ఉదంతాలను పేర్కొనాల్సి వస్తోంది. గుజరాత్‌లో బిల్కిస్ బానూ అనే మహిళపై గోద్రా అనంతర మారణకాండ సందర్భంగా సామూహిక అత్యాచారంచేసి ఆమె కుటుంబ సభ్యులందరినీ హత్య చేసిన సంగతి తెలిసిందే. అత్యాచార కేసులో నేరగాండ్లలో పరివర్తన కలిగి మంచివారుగా మారారంటూ అక్కడి సనాతనవాదుల ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వం జైలునుంచి విడుదల చేసింది. ఆ సందర్భంగా వారిని సనాతన ధర్మాన్ని లేదా హిందూత్వను కాపాడేందుకు కంకణం కట్టుకున్నట్లు చెప్పుకొనే విశ్వహిందూపరిషత్ నేతలు వారికి సన్మానంచేసి, మిఠాయిలు పంచారు. సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ప్రకారం అత్యాచారం కేసులో యావజ్జీవిత శిక్షపడినవారు జైల్లో ఉండాల్సిందే. సదరు సదాచార సనాతనుల కేసులో ఆ తీర్పు రాకముందే శిక్ష విధించినందున తరువాత వచ్చిన తీర్పు వారికి వర్తించదని, పాత నిబంధనల ప్రకారం వారి సత్ప్రవర్తకు మెచ్చి మేకతోలుకప్పి ముందుగానే జైలు నుంచి విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. అయితే సుప్రీంకోర్టు ఆ చర్యను తప్పుపట్టి నేరగాండ్లను తిరిగి జైలుకు పంపింది. అత్యాచారాలకు పాల్పడిన వారిని ఉరితీయాలని ఒకనాడు నినదించిన మన సభ్యసమాజం నేడు నేరగాండ్లకు పూలదండలువేసి సత్కరిస్తే మౌనంగా ఉండిపోయిందంటే మన చర్మాలు ఎంతగా మొద్దుబారిందీ తెలుస్తున్నది. దేన్నయినా సమర్ధించే బాపతు తయారవుతున్నారు. దీనిమీద పవన్ కల్యాణ్ ఏమంటారో ? అంతేనా !

సకల కళావల్లభుడిగా పేరుగాంచిన హంతకుడు, ఇద్దరు మహిళలపై అత్యాచార నేరగాడు డేరా సచ్చా సౌధా ప్రవచకుడు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా బాబా) జీవిత ఖైదు అనుభవిస్తూ బెయిలు మీద వచ్చినప్పుడు బీజేపీ హర్యానా నేతల ఆశీస్సులు పొందారు. ఆ బాబా అనుచరుల ఓట్లు పొందేందుకు హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్ మీద బీజేపీ ప్రభుత్వం విడుదల చేసిందనే విమర్శలు వచ్చాయి. 2018లో జమ్మూలోని కథువాలో ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారికి మద్దతుగా అక్కడ హిందూ ఏక్తామంచ్ పేరుతో జరిపిన ప్రదర్శన తెలిసిందే. మహిళను దేవతగా కొలిచే సమాజంలో దాని గురించి రోజూ ప్రవచనాలు చెప్పేశక్తులే ఈ ఉదంతాలకు పాల్పడ్డాయంటే దేశం ఎటుపోతోందని కాదు, కొంతమంది ఎటు తీసుకుపోతున్నారో జనం ఆలోచించాలి. రామ్ రహీమ్‌కు 2017లో శిక్ష పడింది. అప్పటి నుంచి ఉత్తరాదిన ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ పెరోలు ఇవ్వటం గమనించాల్సిన అంశం.

సనాతనవాదుల మందలో కొత్తగా చేరిన పవన్ కల్యాణ్ తాను ఎన్నో చదివానని చెప్పిన తరువాత ఆ వాదాన్ని భుజానవేసుకున్నారు గనుక అమాయకుడని అనుకోలేం. సినిమా రంగం మనిషి, అక్కడ ఏ ఫార్ములా నాలుగు డబ్బులు తెస్తే పాలోమంటూ మిగతావారూ దాన్నే అనుసరిస్తారు. సనాతనం-హిందూత్వ ఫార్ములా ఓట్లు రాల్చేదిగా ఉందని బీజేపీ దాన్ని ఎప్పటి నుంచో రంగంలోకి తెచ్చింది. సవ్యసాచి మాదిరి సినిమాలతో పాటు రాజకీయాలను కూడా చేయాలనుకుంటున్నారు గనుక పవన్ కల్యాణ్ సనాతన ఫార్ములాను ఎంచుకున్నారని భావించవచ్చు.

బిల్కిస్ బానూ ఉదంతంలో నేరగాండ్లను సమర్ధించటంలో మతాన్ని కూడా జోడించిన దుర్మార్గం, దాన్ని నిస్సిగ్గుగా సమర్ధించిన ఉన్మాదం కనిపిస్తుంది. వారంతా సనాతనులే. మతాలతో నిమిత్తం లేకుండా అత్యాచారం ఎవరి మీద జరిగినా దాన్ని ఖండించాల్సిందే. తమ నేతల ప్రమేయం ఉన్న ఉదంతాల పేరెత్తటానికి సనాతన నరేంద్రమోదీ సిగ్గుపడి ఉంటారు. 2014లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దిల్లీ నిర్భయ కేసును పేరు పెట్టి ప్రస్తావించిన ఆ పెద్దమనిషి తమ ఏలుబడిలో జరిగిన కథువా, ఉన్నావో అత్యాచారాల తరువాత మాట్లాడుతూ సాధారణ పరిభాషలో ఖండించారే తప్ప వాటి ప్రస్తావన ఎక్కడా తేలేదు. ఏడీఆర్ అనే స్వచ్ఛంద సంస్థ మహిళల మీద నేరారోపణలు తమ మీద ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్న 48 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలలో సనాతన ధర్మ పరిరక్షణ గురించి రోజూ కబుర్లు చెప్పే బీజేపీకి చెందిన వారు 14 మంది, తాము కూడా అదే బాటలో నడుస్తామని చెప్పే శివసేనకు చెందిన వారు ఏడుగురు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందినవారు ఆరుగురు ఉన్నారు.

హర్యానాలోని ఆరు జిల్లాలు, పక్కనే ఉన్న పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో డేరా బాబా అనుచరులు ఉన్నారు. ప్రధానంగా దళిత సామాజిక తరగతికి చెందిన వారు, వారి ఓట్ల కోసం పడేపాట్లు ఇవి. ప్రతం చెడ్డా బీజేపీకి ఫలం దక్కలేదని పరిశీలకులు చెబుతున్నారు. డేరా బాబాకు పలుకుబడి ఉందని భావిస్తున్న ఆరు జిల్లాల్లో 28 అసెంబ్లీ సీట్లుండగా బీజేపీ గెలిచింది పది చోట్ల మాత్రమే, కాంగ్రెస్ 15 గెలుచుకుంది. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం దేరాబాబాకు పదకొండుసార్లు బెయిలు ఇచ్చి బయటకు వదిలింది. ఏడుసార్లు వేర్వేరు చోట్ల ఎన్నికలకు ముందు బెయిలు ఇచ్చారు. తాజాగా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అదే జరిగింది. బీజేపీకి ఓటు వేయాల్సిందిగా అనుచరులకు సందేశం పంపాడు. ఆయన ఆశ్రమం ఉన్న సిర్సా జిల్లాలోని ఐదు అసెంబ్లీ సీట్లలో బీజేపీకి ఒక్కటి కూడా దక్కలేదు. మూడు కాంగ్రెస్‌కు రెండు ఐఎన్ఎల్‌డికి వచ్చాయి. బీజేపీతో పోటీపడి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా దేరాబాబా ఆశీస్సుల కోసం ప్రదక్షిణలు చేశారు.

సనాతనవాదుల మందలో కొత్తగా చేరిన పవన్ కల్యాణ్ తాను ఎన్నో చదివానని చెప్పిన తరువాత ఆ వాదాన్ని భుజానవేసుకున్నారు గనుక అమాయకుడని అనుకోలేం. సినిమా రంగం మనిషి, అక్కడ ఏ ఫార్ములా నాలుగు డబ్బులు తెస్తే పాలోమంటూ మిగతావారూ దాన్నే అనుసరిస్తారు. సనాతనం-హిందూత్వ ఫార్ములా ఓట్లు రాల్చేదిగా ఉందని బీజేపీ దాన్ని ఎప్పటి నుంచో రంగంలోకి తెచ్చింది. సవ్యసాచి మాదిరి సినిమాలతో పాటు రాజకీయాలను కూడా చేయాలనుకుంటున్నారు గనుక పవన్ కల్యాణ్ సనాతన ఫార్ములాను ఎంచుకున్నారని భావించవచ్చు. దీని వెనుక ఉన్న కారణాల గురించి కూడా చర్చ జరుగుతున్నది. మర్రిచెట్టువంటి చంద్రబాబు నాయుడి నీడలో ఎంతకాలం ఉన్నా ఎదుగూ బొదుగూ ఉండదు కనుక తాను ప్రత్యేకంగా కనిపించేందుకు సనాతనాన్ని భుజాన వేసుకున్నట్లు కొందరు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతు మీద ఆధారపడిన తాము ఆంధ్రప్రదేశ్‌లో హిందూత్వ అజెండా అమలు జరిపితే రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవచ్చు గనుక శిఖండిలా పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దించిందని కూడా చెబుతున్నారు. హిందూమతంలో సంస్కరణలు తేవాలని ఆర్య (మహత్తర) సమాజాన్ని స్థాపించిన దయానంద సరస్వతిని సనాతనవాదులు కుట్రచేసి చంపారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది తాము వేదాలను ప్రమాణంగా తీసుకుంటామని అదే సనాతన ధర్మమని అందమైన ముసుగువేసుకుంటారు. ఇది వేదకాలం కాదు, మనువాదులు అమలు జరుపుతున్న కుల, మత సమాజం. వేదాలను ప్రామాణికంగా తీసుకొనే వారేమీ కులమతాలకు అతీతంగా లేరు గనుక ఉన్న దుర్మార్గపూరిత వ్యవస్థను ఏదో ఒక పేరుతో సమర్థించే వారిగానే పరిగణించాలి. పవన్ కల్యాణ్ కూడా ఆ తెగకు చెందిన వారే.

# బీటలు వారిన భారత్-కెనడా దౌత్యం

నిత్య చక్రవర్తి

**సి**క్కు తీవ్రవాది, కెనడా పౌరుడు హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకేసులో భారతదేశ ప్రమేయం ఉందని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడీవ్ ఆరోపణ చేయడంతో రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు అత్యంత దిగజారిపోయాయి. నిజ్జర్‌ను గత సంవత్సర హత్య చేశారు. భారత హై కమిషన్‌లోని దౌత్య అధికారులకు ఈ హత్యతో సంబంధం ఉందని ట్రుడీవ్ తీవ్ర ఆరోపణ చేశారు. అమెరికాలో న్యాయవాది జీఎస్ పన్నుపై హత్యాయత్నం జరిగిన విషయంలో ప్రపంచ దౌత్య అధికారుల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. కెనడా, భారత్ పరస్పరం దౌత్యాధికారులను బహిష్కరించాయి. నిజ్జర్ హత్యపై దర్యాప్తు జరుగుతున్నప్పుడు కెనడా అధికారుల మెయిల్స్‌లో భారత హోం శాఖ మంత్రి అమిత్‌షా పేరు ఉండటం మరింత సందేహానికి, ఉద్రిక్తతలకు దారితీసింది. కెనడా వాదన, ఆరోపణలను అమెరికా ఆమోదించడంతో భారత ప్రధాని నరేంద్ర మోదీతో విశ్వసించే అమెరికాకు గల వ్యూహాత్మక సంబంధాలు కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు కెనడాకు బ్రిటన్, ఆస్ట్రేలియ, న్యూజిలాండ్ దేశాలు మద్దతు ప్రకటించాయి. ఈ విషయంలో చాలా పశ్చిమదేశాలు ఇండియాకు వ్యతిరేకమయ్యాయి. అమెరికా నాయకత్వంలో ఏర్పడిన క్వాడ్‌లోని నాలుగుదేశాల్లో ఇండియా ఒక సభ్య దేశం. క్వాడ్‌లో భాగమైన అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు ఇండియాను వ్యతిరేకిస్తున్నాయి.

గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఒంటరైపోయారు. గత పదేళ్ల ఎంతోకృషితో న్యూలుక్ ఫారిన్ పాలసీని(విదేశాంగ విధానంలో కొత్త దృక్పథం) ఏర్పరచుకున్నారు. ఇప్పుడీ విదేశాంగ విధానం శూన్యమైందని భావిస్తున్నారు. అమెరికాకు అత్యంత బలమైన, అనేక దేశాలలో విషయాలు తెలుసుకునేందుకు నిఘా వ్యవస్థ సీఐఏను కలిగి ఉంది. అనేక దశాబ్దాలుగా సీఐఏ పనిచేస్తోంది. కెనడాలో ఉన్న ఇండియా 'రా ఏజంట్లు' హత్య చేశారని అమెరికా ఆరోపించింది. పైగా నజ్జర్ ఇండియా తీవ్రవాదిగా ఉంటూ హింసను రెచ్చగొడుతున్నారని కెనడా ఆరోపించింది. అంతేకాదు, ఇండియా ప్రభుత్వం విదేశాల్లో టెర్రరిస్టు వ్యతిరేక చర్యలను అనుసరిస్తున్నదని కెనడా ఆరోపించింది. మోదీ ప్రభుత్వ అధికారులు, ఏజంట్లు కలిసిపోయారని, హోం మంత్రి అమిత్ షా ఆదేశాలమేరకు పనిచేస్తున్నారనేది రహస్యమేమీకాదని, ఈ విషయాలు తాము రహస్యమార్గాల ద్వారా తెలుసుకున్నామని కెనడా మాట్లాడుతోంది.

శక్తివంతమైన సైన్యంతోనే కాదు, సమర్థనీయమైన ఇంటెలిజెన్సు ఏజన్సీలు 1971 డిసెంబరులో ఇందిరాగాంధీ ప్రభుత్వం పాకిస్తాన్‌పై చేసిన యుద్ధంలో విజయం పొందింది. ఎంతో వ్యూహాత్మకంగా యుద్ధం జరిపి ఇండియా బంగ్లాదేశ్‌ను విముక్తిచేసింది. ఈ సమయంలో సీఐఏ ఏజంట్లను సైతం వైఫల్యానికి గురిచేసింది. యుద్ధ తర్వాత షేక్ ముజిబర్ రెహమాన్ విడుదలకు ఇందిరాగాంధీ రా ఏజంట్లను ఉపయోగించారు. జుల్ఫికరల్ అలీ బుట్టో స్నేహితురాలి సహాయంతో ఈ విజయం సాధించారు. అప్పుడు వ్యూహాత్మకమైన బంధాన్ని ఏర్పాటు చేశారు. పీఎన్ హక్సర్ నాయకత్వంలో టిఎన్ కౌల్, కేబీ లాల్, ఆర్‌సీ గుప్తా ఎంతో చాకచక్యంగా పనిచేశారు. పీఎంఓ నాయకత్వంలో రా ఏజెంట్లు చాలా సమర్థంగా పనిచేశారు. ప్రస్తుతం పీఎంఓలో పనిచేస్తున్న అధికారులు ఇందిరాగాంధీ పాలనలో పనిచేసిన వారితో ఏ మాత్రం పోల్చదగిన వారు కాదు. ప్రధాన మంత్రి మోదీ విదేశాంగ విధానాల మార్గదర్శకాలను మోదీ పీఎంఓ హైజాక్ చేసింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖను పక్కనపెట్టింది. దౌత్యం హ్రస్వదృష్టిగల రాజకీయ ధోరణికి విదేశాంగ విధానం బలైపోతుంది. చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడిన నాటినుంచి, అంతకు పూర్వం నుంచి నిఘా అనేది చాలా ముఖ్యమైంది. రుగ్వేదకాలంలోనూ నిఘా వ్యవస్థ రహస్యాలను సేకరించి రాజులకు తెలియజేసిన పరిస్థితి ఉండేది. ఇది ప్రాచీనమైందని చరిత్రకారులు తెలిపారు. భారత, రామాయణాలలోనూ నిఘా వ్యవస్థను పేర్కొన్నారు. ప్రాచీన గ్రీకు, రోమన్ రాజ్యాలలోనూ నిఘా వ్యవస్థ ఉండాది. రాముడికి హనుమంతుడు రావణాసురుడి ఉనికిని తెలియజేశారు. శత్రురాజ్యాలు ఒకరిపై మరొకరు నిఘా బృందం ద్వారా రహస్యాలు తెలుసుకునేవారు. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రాచీనకాలం నాటి నిఘా విధానాన్ని పాటిస్తున్నారని చెప్తున్నారు. కెనడా, భారత్ మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరచు కోవడమేగాక ప్రపంచంలో అనేక దేశాలతో కలిగిన వైరుధ్యాలను పరిష్కరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## ఏటా రెండుసార్లు ఎన్డీఏ నేతల భేటీ: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: చండీగఢ్‌లో గురువారం జరిగిన ఎన్డీఏ నేతల సమావేశాన్ని చారిత్రక ఘట్టంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. 1975లో ఎమర్జెన్సీ విధించిన తర్వాత కాంగ్రెస్‌యేతర రాజకీయ పార్టీల అతిపెద్ద కలయికగా పేర్కొన్నారు. ఏటా రెండుసార్లు ఇలాంటి సమావేశాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బీజేపీ ఓ ప్రకటనలో ప్రధాని ప్రసంగ వివరాలను వెల్లడించింది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంతో పోల్చితే తన ప్రభుత్వం ప్రజలతో మరింత లోతైన అనుబంధాన్ని కలిగి ఉందనే విషయాన్ని ప్రస్తావించిన మోదీ... గత 10 ఏళ్లలో తనకు 4.5 కోట్ల లేఖలు వచ్చాయని, 2004-14 కాలంలో యూపీఏ ప్రభుత్వానికి సారథ్యం వహించిన మన్మోహన్ సింగ్‌కు కేవలం 5 లక్షల లేఖలు వచ్చాయని చెప్పారు. ఇది తమ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని అన్నారు. బీజేపీ, దాని అనేక మిత్రపక్షాలకు చెందిన 17 మంది ముఖ్యమంత్రులు, 18 మంది ఉప ముఖ్యమంత్రులు హాజరైన ఈ సదస్సులో మోదీ మాట్లాడుతూ సజావుగా పాలన, వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, పాలనలో పారదర్శకత పెట్టుబడిదారులను ఆకర్షించడంలో దోహదపడ్డాయని, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. సాధారణ పౌరుల పెరుగుతున్న ఆకాంక్షలను ఎన్డీఏ నెరవేరుస్తోందని చెప్పుకొచ్చారు. 2014 నుండి ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో విజయం సాధించామని తెలిపారు. హర్యానాలో బీజేపీ విజయం ముఖ్యమైనదే కాక చారిత్రాత్మకమని ప్రధాని ప్రశంసించారు. సమాజంలోని అన్ని వర్గాల విశ్వాసాన్ని, మద్దతును ఎన్‌డిఎ పొందిందని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్డీఏ రైతు వ్యతిరేకి అనే తప్పుడు కథనాన్ని చిత్రీకరించడానికి ప్రయత్నించాయి కానీ అధికార పార్టీకి రైతులే పెద్ద సంఖ్యలో మద్దతు ఇచ్చారన్నారు. ప్రగతికి, ఎన్డీయే సుపరిపాలన ఎజెండాకు అండగా ఉంటామని ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారన్నారు.

## 38కు పెరిగిన బస్తర్ ఎన్‌కౌంటర్ మృతులు

దంతెవాడ: చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో రెండు వారాల కిందట జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల సంఖ్య 38కు పెరిగింది. తొలుత 31 మంది చనిపోయినట్లు భద్రతా దళాలు వెల్లడించగా, మరో ఏడుగురు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు మావోయిస్టులు ధ్రువీకరించినట్లు చత్తీస్‌గఢ్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఈనెల 4న జరిగిన ఈ ఎన్‌కౌంటర్... అత్యధిక మంది మావోయిస్టులను మట్టుబెట్టిన ఆపరేషన్‌గా చరిత్రకెక్కింది. 24ఏళ్ల చరిత్రలోనే సింగిల్ ఆపరేషన్‌లో ఇంత భారీగా మావోయిస్టులు చనిపోలేదు. మరణించిన మావోయిస్టులపై రూ.2.62 కోట్ల రివార్డున్నది. దంతెవాడ, నారాయణ్‌పూర్, కండగావ్, బస్తర్ జిల్లాల్లో జరిగిన 250కుపైగా ఘటనల్లో వీరు వాంటెడ్ కాగా పోలీసులతో 61 ఎన్‌కౌంటర్లు, పోలీసు క్యాంపులపై 11 దాడులు, 17 ఐఈడీ పేలుళ్లు, తొమ్మిది నిప్పుపెట్టిన ఘటనలు, పోలింగ్ బూత్‌లపై మూడు దాడుల్లో కీలకంగా వ్యవహరించినట్లు ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 200 మంది మావోయిస్టులు చనిపోయినట్లు వెల్లడించారు.

## విపక్ష ఎంపీలు బెదిరించారు తేజస్వి సూర్య

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్‌పర్సన్ జగదాంబికా పాల్‌ను, ప్యానెల్‌లో ఒక సాక్షిని కొందరు ప్రతిపక్ష సభ్యులు బెదిరించారని, పత్రాలు కూడా చించివేశారని బీజేపీ నేత తేజస్వీ సూర్య లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. కర్నాటకలోని వక్ఫ్ భూ కుంభకోణంపై తన అభిప్రాయాలు వినడానికి కర్నాటక రాష్ట్ర మైనారిటీల కమిషన్ మాజీ చైర్మన్ అన్వర్ మణిపాడ్డిని కమిటీ పిలిచినప్పుడు అక్టోబరు 14న ప్రతిపక్ష సభ్యులు అన్‌పార్లమెంటరీ ప్రవర్తనకు పాల్పడ్డారని బెంగళూరు సౌత్ నుంచి రెండు పర్యాయాలు ఎంపీగా ఉన్న సూర్య పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్యానెల్ సమావేశంలో పాల్ 'పార్లమెంటరీ ప్రవర్తనా నియమావళిని స్థూలంగా ఉల్లంఘించారని' ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారికి లేఖ రాసిన కొద్ది రోజుల తర్వాత బీజేపీ నాయకుడు స్పీకర్‌కు ఈ లేఖ పంపారు.

# రూ.పదివేల కోట్ల కుంభకోణం

- ఎన్నికల విరాళాలిచ్చిన కంపెనీలకు ప్రజల సొమ్ము దోచిపెట్టారు
- మహాయుతి సర్కారు నిర్వాకాన్ని ఎండగట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అవినీతి బాంబు పేల్చింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం రూ.10,000 కోట్ల భారీ అవినీతి కుంభకోణానికి పాల్పడిందని కాంగ్రెస్ విమర్శించింది. ఎన్నికల ప్రచారానికి దండిగా విరాళాలిచ్చిన కంపెనీలకు ప్రతిఫలంగా ఇన్‌ఫ్రా టెండర్లలో ప్రత్యేక హక్కులు కల్పించిందని పేర్కొంది. రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో (ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు) కొన్ని కంపెనీలకు ప్రత్యేక హక్కులు కట్టబెట్టడం ద్వారా ఆయా కంపెనీల నుంచి ఎన్నికల విరాళాల రూపంలో రూ.పదివేల కోట్లు కొట్టేశారని పేర్కొంది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ... 'మనం చిన్నతనంలో దోపిడీలు, కిడ్నాప్‌లు, బెదిరింపులకు అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం డి-కంపెనీ గురించి విన్నాం... అదే తరహాలో ఇప్పుడు కొత్తగా బి-కంపెనీ గురించి వింటున్నాం. నరేంద్ర మోదీ, అమిత్ షా హయాంలో మహారాష్ట్రను దోచుకుతింటున్న బీజేపీయే ఆ కంపెనీ' అని పవన్ ఖేరా విమర్శించారు. ఎన్నికల బాండ్ల విక్రయం ద్వారా వచ్చిన మొత్తం నిధులలో 13 శాతం మహారాష్ట్ర నుంచే వచ్చాయని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుదారుల సొమ్ము రూ. 10వేల కోట్లను ఎంపిక చేసిన కంపెనీలకు దోచిపెట్టి... ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మరో చేత్తో వెనక్కి తీసుకున్నారని ఖేరా ఆరోపించారు. అవకతవకలు జరిగాయని ఖేరా ఆరోపించిన రహదారుల ప్రాజెక్టుల్లో పూణే రింగ్ రోడ్ ఇ1, పూణే రింగ్ రోడ్ ఇ3, పూణే రింగ్ రోడ్ డబ్ల్యూ1, పూణే రింగ్ రోడ్ డబ్ల్యూ2, పూణే రింగ్ రోడ్ డబ్ల్యూ3, పూణే రింగ్ రోడ్ డబ్ల్యూ4, ఎంఎంసి1, ఎంఎంసి9 ఉన్నాయి. 'మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్ఆర్‌డిసి) మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రీ-క్వాలిఫికేషన్ ప్రమాణాలను మార్చింది. ఎంఎస్ఆర్‌డిసి మార్గదర్శకాల ప్రకారం ఒక కంపెనీకి రెండు ప్రాజెక్ట్‌ల కంటే ఎక్కువ ఇవ్వరాదని చెబుతోంది. ఇక్కడ రెండు కంపెనీల మధ్య ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలు పంపిణీ చేయబడ్డాయి" అని ఖేరా పేర్కొన్నారు. 'కిలోమీటర్‌కు రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చు రెండింతలు పెరిగింది. ఈ ప్రాజెక్టుల ప్రత్యేకత ఏమిటి? ఎలా రెట్టింపు అవుతుంది?' అని ఖేరా ప్రశ్నించారు. నిర్మాణంలో 10 శాతం మాత్రమే సొరంగాలు తవ్వుతుండగా, కొన్ని కంపెనీలకు అనుకూలంగా ఉండేలా ప్రాజెక్టు మొత్తానికి టన్నెల్ ప్రాజెక్టులుగా నామకరణం చేశారని ఖేరా వివరించారు. 'వారు (మహాయుతి కూటమి) అవినీతి మార్గాల్లో అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వాన్ని నడుపుతూనే వారు కూడా అవినీతిలో మునిగిపోతూనే ఉన్నారు' అని ఖేరా అన్నారు. రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రెండు కంపెనీలకు అనుకూలంగా నిబంధనలను సవరించారన్నారు. ప్రభుత్వం తన ప్రజలను దోచుకునే దౌర్జన్యం స్వతంత్రభారత చరిత్రలో జరగలేదని ఖేరా దుయ్యబట్టారు.

రాష్ట్రంలో కాగ్, మీడియా, కోర్టులు, మహారాష్ట్ర ఓటర్లకు ఇది మేల్కొలుపు అని ఖేరా అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఈ అవినీతి కుంభకోణంలో ప్రమేయమున్న ఎవరినీ వదలబోమని హెచ్చరించారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం చెప్పాలని ఖేరా డిమాండ్ చేశారు.

# సిద్ధరామయ్యకు బిగుస్తున్న ఉచ్చు

### ఈడీ దూకుడు... ముడా కార్యాలయంలో సోదాలు

బెంగళూరు: మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. మైసూరులోని ముడా కార్యాలయంలో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు చేపట్టారు. హుడా భూముల కేటాయింపు వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు, అధికారుల ప్రమేయంపై ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు సంచలనం సృష్టిస్తున్నాయి. ముడా కమిషనర్ రఘునందన్ సహా కొంతమంది అధికారులను దర్యాప్తు బృందం కలిసినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కేంద్ర పారామిలటరీ పోలీసుల భద్రతతో ఈడీ అధికారులు ముడా కార్యాలయంతో పాటు మైసూరులోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో కానీ, వారి సంబంధీకుల ఇళ్లలో కానీ సోదాలు జరపలేదని ఆ వర్గాలు వెల్లడించాయి. రెండ్రోజుల క్రితం ముడా అథారిటీ చైర్మన్ కె.మరిగౌడ తన ఉద్యోగానికి రాజీనామా చేయడం సంచలనమైంది. సిద్ధరామయ్యకు ఆయన సన్నిహితుడనే పేరుంది. అనారోగ్యం కారణంగానే మరిగౌడ రాజీనామా చేసినట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

కేసు పూర్వాపరాల్లోకి వెళితే...ముడాకు చెందిన 14 స్థలాలను సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి కేటాయించడంపై ముఖ్యమంత్రి కొద్దికాలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై విచారణకు గవర్నర్ అనుమతించడం సంచలనమైంది. దీనిపై సిద్ధరామయ్య హైకోర్టులో సవాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే లోకాయుక్త పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది పేర్లు చేర్చారు. ముడా స్కామ్ ఆరోపణలతో తన ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించారు. తనపై వచ్చిన ఆరోపణలను సిద్ధరామయ్య ఖండించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసులు బనాయించారని చెబుతున్నారు.

## మళ్లీ రష్యాకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మరోసారి రష్యాలో పర్యటించనున్నారు. అక్టోబర్ 22-23 తేదీలలో కజాన్‌లో నిర్వహించే 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ఆహ్వానిస్తూ రష్యా అధ్యక్షుడు పుతిన్ నుండి లేఖ వచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం పేర్కొంది. ప్రపంచ అభివృద్ధి, భద్రత కోసం బహుపాక్షికతను బలోపేతం చేయడం లక్ష్యంతో జరిగే ఈ కీలకమైన సదస్సు ప్రపంచ సమస్యలను చర్చించడానికి దేశాధినేతలకు ఓ ముఖ్యమైన వేదిక కానుందని ఎంఈఏ ఓ ప్రకటనలో పేర్కొంది. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడానికి, భవిష్యత్ సహకారం కోసం అనువైన ప్రాంతాలను గుర్తించడానికి సదస్సు విలువైన అవకాశాన్ని అందిస్తుందని తెలిపింది. 22వ భారత్ -రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఈ ఏడాది జులైలో మోదీ రష్యాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## పోస్టాఫీస్‌లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

బెంగళూరు: బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పెద్దమొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరులోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ కస్టమ్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించింది. దాదాపు 606 డ్రగ్స్ పార్శిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిని అమెరికా, బెల్జియం, బ్రిటన్, థాయ్‌లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌లో హైడ్రో గంజాయి, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ క్రిస్టల్స్ తదితర మత్తు పదార్థాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. వీటిని బెంగళూరులో అధిక ధరలకు విక్రయించేందుకు నిందితులు ఇండియన్ పోస్టల్ సర్వీస్ ద్వారా దిగుమతి చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు.

# ఈశా ఫౌండేషన్‌కు ఊరట

న్యూఢిల్లీ: మహిళలు సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ ఫౌండేషన్‌పై నమోదైన కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం మూసేసింది. ఈ వ్యవహారంపై ఇద్దరు యువతుల తండ్రి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టేసింది. తమిళనాడులోని కోయంబత్తూరులో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఈశా యోగా కేంద్రంలో ఉంటున్న తన ఇద్దరు కుమార్తెలను అప్పగించాలని కోయంబత్తూరు వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కామరాజ్ మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో... తన ఇద్దరు కుమార్తెలు గీత, లత ఈశా యోగా కేంద్రంలో యోగా నేర్చుకునేందుకు వెళ్లి అక్కడే ఉండిపోయారన్నారు. తమ కుమార్తెలను గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. దీనిపై దర్యాప్తు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు తమిళనాడు పోలీసులను ఆదేశించింది. ఇష్టపూర్వకంగానే తాము ఆశ్రమంలో ఉన్నట్లు ఆ యువతులు చెప్పారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ నివేదికను పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం 'వారిద్దరు మేజర్లు. వారి ఆచూకీ ఎక్కడుందో తెలిసింది. స్వచ్ఛందంగానే ఆశ్రమంలో ఉన్నట్లు చెప్పారు. అందువల్ల హెబియస్ కార్పస్ పిటిషన్ కొట్టేస్తున్నాం. ఈ కేసులో హైకోర్టు నుంచి తదుపరి ఆదేశాలు అవసరం లేదు' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. విచారణ సందర్భంగా ఇద్దరు యువతుల్లో ఒకరు సుప్రీంకోర్టు ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు.

# భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో కుట్రకోణం?

చెన్నై: భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం వెనుక కుట్రదాగి ఉందనే అనుమానాలు అధికమయ్యాయి. ఎన్ఐఏ, రైల్వే అధికారులు శుక్రవారం చేపట్టిన విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదానికి రైల్వే ఉద్యోగులేనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విచారణలో ... ప్రమాద ప్రాంతంలో స్విచ్ పాయింట్ల బోల్టులు తొలగించినట్లు అధికారులు గుర్తించారు. లూప్ లైన్‌లో పట్టాలు ట్రాక్‌గా మారే చోట బోల్ట్‌నట్ విప్పడంతో గూడ్స్ ట్రాక్ మారింది. దీంతో గూడ్స్ ట్రైన్‌ను భాగమతి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 20 మందికి పైగా రైల్వే సిబ్బంది, అధికారులను సౌత్‌జోన్ రైల్వే సేఫ్టీ కమిషనర్ చౌదరి ప్రశ్నించారు. బోల్ట్ విప్పింది బయటి వ్యక్తులు కాదని, రైల్వే ఉద్యోగులేనని ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఎందుకు అలా చేయాల్సి వచ్చిందనే దానిపై విచారణ కొనసాగుతుంది. దాని వెనుక కుట్ర కోణంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మైసూరు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా దర్భాంగ వెళ్లాల్సిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) రైలు పొన్నేరి స్టేషన్ దాటింది. ఈ నెల 11వ తేదీ రాత్రి 8.27కు తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో రైలు ప్రధాన లైనుపై నుంచి కాకుండా లూప్‌లైన్‌లోకి వెళ్లడం, ఆ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టడం క్షణాల్లో జరిగిపోయాయి. ఈ ప్రమాదంలో 13 బోగీలు పట్టాలు తప్పాయి. పార్సిల్ వ్యానులో మంటలు చెలరేగాయి. రైలు ప్రమాదంపై సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు, ఎన్ఐఏ అధికారులు విచారణ చేపట్టారు. తాజా విచారణలో రైలు ప్రమాదంపై కుట్రకోణం ఉందని సమాచారం. దీనిపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## డేరా బాబాకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2015లో గురుగ్రంథ్ సాహిబ్‌ను అపవిత్రం చేశారనే ఆరోపణలపై నమోదైన కేసుపై పంజాబ్- హర్యానా హైకోర్టు ఇచ్చిన స్టేను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం తొలగించింది. దీంతో ఈ కేసు తిరిగి విచారణకు రానుంది. సుప్రీంకోర్టు 'స్టే' ఎత్తివేడంతో పాటు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని దేరాబాబాను ఆదేశించింది. బర్గారీలో గురుగ్రంథ సాహెబ్‌ను అపవిత్రం చేశారనే ఆరోపణలను దేరా బాబా ఎదుర్కొంటున్నారు. దీనిపై మూడు కేసులు నమోదు కాగా, విచారణపై హైకోర్టు గత మార్చిలో స్టే ఇచ్చింది. దీనిని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దేరాబాబాకు ఇప్పటికే అత్యాచారం, హత్య కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నారు.

## ఉప వర్గీకరణకు హర్యానా సిద్ధం

చండీగఢ్: షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు హర్యానా ప్రభుత్వం సిద్ధమైంది. సుప్రీం ఆదేశించినట్లుగా తమ రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తొలి సమావేశం నిర్ణయించింది. ప్రస్తుత రిజర్వేషన్ వ్యవస్థలోని ప్రయోజనాలు సుముచితంగా పంచేలా తమ నిర్ణయం దోహదమవుతుందని పేర్కొంది. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం చొప్పున రిజర్వేషన్ అమలవుతోంది.ఎస్సీలు, ఎస్టీల ఉప వర్గాలకు ప్రస్తుతమున్న 22.5శాతం రిజర్వేషన్‌లో నుంచి ప్రత్యేక కోటా కేటాయించేలా అవకాశం హర్యానాకు ఇకపై ఉంటుంది. ఉప వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. కాగా, హర్యానా ముఖ్యమంత్రిగా నయాబ్ సైని అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గం తొలిసారి భేటీ అయింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ సేవలను అందించాలని నిర్ణయించింది. ఎంఎస్‌పీ తదితర నిర్ణయాలనూ సైని కేబినెట్ తీసుకుంది.

## 'జై భీమ్, ఫరిష్తే' తిరిగి అమలు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన జై భీమ్, ఫరిష్తే పథకాలను తిరిగి అమలు చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనను జైలుకు పంపిన తర్వాత వీటిని బీజేపీ నిలిపివేసిందని ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'అణగారిన వర్గాల పిల్లలకు విద్యలో సమాన అవకాశాలు కల్పించేందుకు జై భీమ్ యోజన తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఐఐటీలు, సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ఆర్థిక సాయాన్ని ఈ పథకం ద్వారా సమకూర్చాం' అని తెలిపారు. ఐఐటీ, సివిల్ సర్వీసెస్ కోసం కోచింగ్ ఖరీదుతో కూడుకున్నదని, పేదలకు సమాన అవకాశాలు కల్పించాలని బాధ్యత తీసుకొని ఈ పథకం తీసుకొచ్చామని చెప్పారు. తనను జైలుకు పంపాక బీజేపీ ఈ యోజనను నిలిపివేసిందని, ఇప్పుడు దానిని పునఃప్రారంభిస్తామని కేజ్రీవాల్ అన్నారు. ప్రతి విద్యార్థికి రూ.2,500 స్టైఫెండ్ అందిస్తామని చెప్పారు. జై భీమ్ లబ్ధిదారులపై, ప్రభుత్వ వ్యయంపై పరిమితి ఉండబోదన్నారు. ఫరిష్తే పథకాన్ని ప్రస్తావిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రైవేటు సహా ఏ ఆసుపత్రులోనైనా ఉచితంగా వైద్యం అందేందుకు ఇది దోహదమైందని గుర్తుచేశారు. నిలిపివేయడానికి ముందు వరకు దాదాపు 26వేల ప్రాణాలను కాపాడిందని తెలిపారు. ఈ పథకాన్ని తిరిగి అమల్లోకి తేవడం ద్వారా ఢిల్లీ పౌరులకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నట్లు కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మాట్లాడుతూ రెండు పథకాలను ప్రశంసించారు. వెనుకబడిన వర్గాలు, పేదల పిల్లలను విద్య ద్వారా సాధికారత సిద్ధించాలనే కేజ్రీవాల్ విజన్ ముందర బీజేపీ కుట్రలన్నీ నీరుగారిపోయాయన్నారు.

## జార్ఖండ్‌లో ఎన్డీయే సీట్ల సర్దుబాటు

### ఏజేఎస్‌యూకు 10, జేడీయూకు 2, ఎల్‌జేపీకి ఒకటి కేటాయింపు

రాంచీ: నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్డీయే) మిత్రపక్షాలు జార్ఖండ్ బరిలో నిలుస్తున్నట్లు అసోం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ తెలిపారు. ఏజేఎస్‌యూ పార్టీ 10 స్థానాల్లో పోటీ చేస్తుండగా, జేడీ(యూ) రెండు చోట్ల, ఎల్‌జేపీ (రామ్ విలాస్) ఒక సీటుకు పోటీ పడుతున్నట్లు వెల్లడించారు.

సీట్ల సర్దుబాటు దాదాపు ఖరారైందన్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చాతో సహా ప్రత్యర్థి పార్టీల వ్యూహాల విషయంలో వేచి చూడాలనే ధోరణితో బీజేపీ ఉన్నది. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) పార్టీ సిల్లి, రాంఘర్, గోమియా, ఇఛాఘర్, మండు, జుగ్సాలై, దుమ్రి, పకూర్, లోహర్‌దాగా, మనోహర్‌పూర్ స్థానాల్లో పోటీ చేస్తోంది. జంషెడ్‌పూర్ వెస్ట్, తమర్ నుంచి జేడీ(యూ)... ఛాత్ర స్థానం నుంచి ఎల్‌జేపీ (రామ్ విలాస్) పోటీ చేయనుంది. బీజేపీ 68 స్థానాల్లో పోటీ చేసే విషయంలో ఇంకా నిర్ణయం జరగలేదని బిశ్వశర్మ తెలిపారు. అభివృద్ధి అజెండాతో ఎన్నికలకు వెళు తున్నామంటూ గెలుపుపై దీమా వ్యక్తంచేశారు. జార్ఖండ్ అసెంబ్లీకి నవంబరు 13, 20 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## సీట్ల పంపకంపై జాప్యమేంటి?

### కాంగ్రెస్ రాష్ట్ర నేతలపై సంజయ్‌రౌత్ అసహనం

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎంవీఏ భాగస్వాముల మధ్య సీట్ల పంపిణీ చర్చల్లో జాప్యంపై శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శుక్రవారం నిరాశ వ్యక్తం చేశారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకులు 'నిర్ణయాలు తీసుకోలేరు' అని పేర్కొన్నారు. 288 అసెంబ్లీ సీట్లలో 200 సీట్లపై మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) భాగస్వామ్య పక్షాలు-కాంగ్రెస్, సేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఏకాభిప్రాయానికి చేరుకున్నాయని రౌత్ విలేకరులతో అన్నారు. సీట్ల పంపకంపై శుక్రవారం ఉదయం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్, ఆ పార్టీ మహారాష్ట్ర ఇంచార్జి రమేశ్ చెన్నితాలతో మాట్లాడినట్లు రాజ్యసభ సభ్యుడు తెలిపారు. ఆ రోజు తర్వాత కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో కూడా మాట్లాడతారని సేన (యూబీటీ) నాయకుడు చెప్పారు. 'పెండింగ్‌లో ఉన్న నిర్ణయాన్ని వేగవంతం చేయాలి. చాలా తక్కువ సమయం మిగిలి ఉంది. మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు నిర్ణయాలు తీసుకోలేరు. వారు జాబితాను తరచుగా ఢిల్లీకి పంపాలి. ఆపై చర్చలు జరుగుతాయి. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి' అని రౌత్ అన్నారు. గురువారం సాయంత్రం, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే మాట్లాడుతూ ప్రతిష్టంభనను పరిష్కరించడానికి ఎంవీఏ భాగస్వాములు కలిగి ఉన్న 20-25 అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాను ప్రతి పార్టీ తమ తమ అధిష్టానాలకు పంపుతామని చెప్పారు. సీట్ల పంపకాల చర్చల్లో నిమగ్నమైన ఎంవీఏ నేతలు గురువారం తుది సమావేశం అయ్యారని పటోలే విలేకరులకు తెలిపారు. అక్టోబరు 18-19లోగా మొత్తం 288 నియోజకవర్గాలకు సీట్ల పంపకాన్ని ప్రకటించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో 30 స్థానాల్లో ఎంవీఏ అద్భుతంగా విజయం సాధించింది. రాష్ట్రంలో నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, 23న ఓట్లను లెక్కిస్తారు.

## తక్షణమే రాష్ట్ర హోదా పునరుద్ధరణ

### జమ్మూకశ్మీర్ కేబినెట్ తీర్మానం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని కేబినెట్ ఆమోదించింది. గురువారం జరిగిన మొదటి సమావేశంలో జమ్మూకశ్మీర్ మంత్రివర్గం రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 'తీర్మానం ముసాయిదా సిద్ధమైంది. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ తీర్మానం ముసాయిదాను ప్రధాని మోదీకి అందజేయడానికి ముఖ్యమంత్రి రెండు రోజుల్లో న్యూఢిల్లీకి వెళతారు' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌదరి, మంత్రులు సకీనా మసూద్ ఇటూ, జావేద్ అహ్మద్ రాణా, జావైద్ అహ్మద్ దార్, సతీశ్ శర్మ హాజరయ్యారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించకపోతే తమ పార్టీ కేబినెట్‌లో చేరదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదాను కేంద్రం పునరుద్ధరిస్తుందని ఆశిస్తున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా విశ్వాసం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని 2019 ఆగస్టు 5న మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జమ్మూకశ్మీర్, లదాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది.

# విపక్షాల సీట్ల లొల్లి

- మహారాష్ట్రలో 25-30 స్థానాలపై ప్రతిష్టంభన
- విదర్భ సీట్ల కోసం ఉద్ధవ్ వర్గం పట్టు
- పటోలేతో చర్చలకు శివసేన (యూబీటీ) నిరాకరణ
- నేరుగా రాహుల్‌తో మాట్లాడతాం: సంజయ్ రౌత్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే తేదీ ప్రకటించడంతో త్వరలోనే నామినేషన్ల ప్రక్రియ మొదలు కాబోతోంది. ఇండియా ఐక్య కూటమిలో భాగంగా మహా వికాస్ అగాధీ (ఎంవీఏ) సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగిస్తోంది. ఇప్పటికే 288కుగాను 260 స్థానాలపై ఏకాభిప్రాయం కుదరగా మిగతా స్థానాలపై ప్రతిష్టంభన నెలకొంది.విదర్భలో ఎక్కువ స్థానాలను ఉద్ధవ్ వర్గం కోరుకుండటం అందుకు మహారాష్ట్రలోని కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించకపోవడం వివాదానికి తెరతీసింది. ఇప్పుడు ఈ పంచాయతీ అధిష్ఠానం వద్దకు చేరింది. నేరుగా రాహుల్ గాంధీతో మాట్లాడతామని, ఇక కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలెతో చర్చలు జరిపి సమయం వృధా చేయబోమని శివసేన (యూబీటీ) ప్రకటించింది. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు, ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మధ్య సీట్ల సర్దుబాటులో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నానా పటోలేతో చర్చలు జరిపేందుకు శివసేన (యూబీటీ) నిరాకరించింది. మహా వికాస్ అగాడీ (ఎంవీఏ)లోని కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) మధ్య 260 స్థానాల విషయంలో ఏకాభిప్రాయం కుదిరింది. మిగతా సీట్లపై పంచాయతీ దృష్ట్యా నేరుగా కాంగ్రెస్ అధిష్ఠానంతోనే చర్చలు జరపాలని ఉద్ధవ్ వర్గం నిర్ణయించింది. ఇదే విషయాన్ని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం విలేకరులతో చెప్పారు. మహారాష్ట్రలోని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయాలు తీసుకోలేదని పటోలెనుద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్‌తో పాటు ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి రమేశ్ చెన్నితల దృష్టికి సీట్ల వివాదాన్ని తీసుకెళ్లినట్లు రౌత్ తెలిపారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనే నేరుగా చర్చించాలని నిర్ణయించామన్నారు. పెండింగ్ సీట్లపై సత్వరమే నిర్ణయం జరిగడం అవసరమని అన్నారు. మహారాష్ట్రలోని కాంగ్రెస్ నేతలు పదేపదే దిల్లీతో సంప్రదింపులు జరుపుతుండటంతో ప్రక్రియలో జాప్యం జరుగుతోందని రౌత్ తెలిపారు. నామినేషన్లకు సమయం సమీపిస్తుండటంతో రాహుల్‌తో నేరుగా చర్చలు జరిపి సీట్లను ఖరారు చేయాలని తమ పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు చెప్పారు. కాగా, విదర్భలో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఉద్ధవ్ వర్గం కోరుకుండటం, అందుకు పటోలె నిరాకరించడంతో సీట్ల పంచాయతీ తెగలేదని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో 48కుగాను 13 స్థానాల్లో గెలుపొంది విదర్భాలో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. అంతకుముందు కూడా మంచి రికార్డు నెలకొల్పింది. పటోలేకు ఇక్కడ మంచి పట్టున్నది. శివసేన (యూబీటీ) ఏ మేరకు ప్రభావం చూపగలదన్నది అస్పష్టంగా ఉండటమే ఎక్కువ సీట్లు కేటాయించడంలో కాంగ్రెస్ విముఖతకు కారణమని సమాచారం.

**ఆ 25-30 స్థానాలపై అధిష్ఠానమే నిర్ణయిస్తుంది: పటోలే**

25-30 స్థానాలపై ప్రతిష్టంభన నెలకొన్నట్లు కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలె తెలిపారు. వీటిపై అధిష్ఠానమే నిర్ణయిస్తుందన్నారు. గురువారం రాత్రికే సీట్లపై చర్చలు ముగిశాయని చెప్పారు. శివసేన (యూబీటీ) జాబితాలో 48 స్థానాలు ఉన్నాయని, 18 స్థానాలను కాంగ్రెస్ వదులుకుందని తెలిపారు. 25-30 స్థానాలపై వివాదం గురించి అధిష్ఠానానికి తెలియజేసినట్లు చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌ను సంప్రదించకుండా సంజయ్ రౌత్, జయంత్ పాటిల్ ఏ నిర్ణయాలైనా సొంతంగా తీసుకుంటారా అంటూ పటోలె ప్రశ్నించారు. పదేపదే సంప్రదింపులు జరపడం వల్ల జాప్యం జరుగుతున్నట్లు మిత్రపక్షం చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. అలాగే తను ఉంటే చర్చలకు ఉద్ధవ్ వర్గం రాదన్న వదంతులనూ కొట్టిపారేశారు.

## పెట్టుబడులు రాకుండా జగన్ కుట్ర: మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రోజుకో అబద్ధం చెప్పి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న ఇమేజ్‌తో జగన్ కుట్రలన్నీ సమర్థంగా తిప్పికొట్టగల్గుతున్నామన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి, పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురి చేసిన జగన్‌కి... ఆయన పార్టీ ఘోర ఓటమి పాలైనా మార్పు కనపడడం లేదన్నారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని జగన్ గ్రహించడం లేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతికొద్దికాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించినట్లు వివరించారు. లోక్‌సభాపక్ష నేత శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులు, పోలవరం ప్రాజెక్టు పూర్తికి ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. క్రమశిక్షణకు సీఎం అత్యంత ప్రాధాన్యత ఇస్తారని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. ప్రజలకు సుపరిపాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలివ్వడం, పెన్షన్లు సైతం అదేవిధంగా చెల్లించడం కూటమి ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. రైతు సంఘాలు, నీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. త్వరలో రైతు ప్రాతినిధ్యంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ విదేశాల్లోని తెలుగువారంతా పార్టీ సభ్యత్వంపై ఆసక్తి చూపిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

నవంబర్ 10 నుండి 15 వరకు

## కడపలో సైనిక నియామకాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కడపలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) స్టేడియంలో నవంబర్ 10 నుంచి 15 వరకూ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ (గుంటూరు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ ఉద్యోగాలకు నియామకం జరుగుతుంది. ట్రేడ్స్‌మెన్ పోస్టుకు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. మిగతా ఉద్యోగాలకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగబోతుందని వెల్లడించింది. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి అడ్మిట్ కార్డులు అందజేస్తున్నారు. అడ్మిట్ కార్డులు వచ్చిన అభ్యర్థులు ర్యాలీకి హాజరుకావాల్సి ఉంటుంది.

## ‘పర్సనల్ లా’తో సంబంధం లేదు

బాల్య వివాహాల కట్టడిపై సుప్రీం

న్యూఢిల్లీ: బాల్య వివాహాల కట్టడికి సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు జారీ చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పర్సనల్ లాతో తగ్గించవద్దని వెల్లడించింది. ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్యవివాహాల నిరోధం, మైనర్ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది. ‘బాల్యవివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతమవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యం పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి’ అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు.

## లెబనాన్‌కు భారత్ మానవతా సాయం

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్-హెజ్బుల్లా మధ్య భీకర దాడులు కొనసాగుతున్న వేళ... లెబనాన్‌కు భారత్ మానవతా సాయం అందించింది. సంక్షోభ పరిస్థితుల్లో అక్కడి ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో వారికి అవసరమైన ఔషధాలు పంపించాలని నిర్ణయించింది. మొత్తం 33 టన్నుల వైద్య సామగ్రి పంపుతున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా తొలి విడతలో 11 టన్నుల వైద్యసామగ్రిని శుక్రవారం ప్రత్యేక విమానంలో పంపించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. కార్డియోవాస్కులర్ ఔషధాలు, నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు, యాంటీ బయాటిక్స్, అనస్థీసియాకు సంబంధించిన ఔషధాలు పంపినట్లు ఆయన ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు

డీజీపీ ద్వారకా తిరుమలరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలీసు ఉద్యోగం అంటే కష్టాలు, సవాళ్లు ఎదుర్కొనే ఉద్యోగమని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఈ నెల 21 నుంచి జరిగే సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సంక్లిష్ట పరిస్థితులు, అవమానాలు, దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రాణాలను సైతం త్యాగం చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సరిహద్దులో అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ అక్టోబరు 31న సంస్మరణ దినం జరుపుకుంటున్నామని డీజీపీ వెల్లడించారు. అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు సంస్మరణ దినోత్సవాలు జరుపుకోనున్నట్లు చెప్పారు. అమర వీరుల కుటుంబాలను సీనియర్ అధికారులతో పరామర్శించే కార్యక్రమం ఉంటుందన్నారు. పాఠశాలల్లో పోలీసు విధులపై అవగాహన కార్యక్రమాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, రక్తదాన శిబిరాలు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. జీపీఏఐ పథకం ద్వారా పోలీస్ కానిస్టేబుల్ మొదలుకుని డీజీపీ స్థాయి అధికారుల వరకు అందరికీ 20 లక్షల నుంచి 45 లక్షల వరకు బీమా పథకం రెండు సంవత్సరాలుగా పరిపాలనా సంబంధ కారణాలతో నిలిచిపోయిందని, ఈ సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. విధులకు వచ్చే స్త్రీ, పురుషులకు అన్ని జిల్లాల ప్రధాన కార్యాలయాల్లో రవాణా వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జెండాలు, స్టిక్కర్లను విక్రయించడం ద్వారా సేకరించిన నిధులను ప్రమాదాలు, హింసాత్మక ఘటనల్లో గాయపడిన లేక మరణించిన పోలీసు సిబ్బందికి పునరావాసం, పోలీసు సిబ్బంది పిల్లలకు 1వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకోవడానికి స్కాలర్ షిప్, ట్యూషన్ ఫీజు, దుస్తులు, వసతి చార్జీలను, రెండు పోలీసు బాలుర వసతి గృహాల నిర్వహణకు (నెల్లూరు, గుంటూరు) వినియోగిస్తామన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో సంక్షేమ చర్యల కింద 1,733 మంది పోలీసు సిబ్బంది పిల్లలకు ఉపకార వేతనాల కోసం రూ.3.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. పోలీస్ కేంద్ర కార్యాలయం వద్ద శాశ్వత పోలీసు అమరవీరుల స్మారకం నిర్మాణం ప్రక్రియలో ఉందని చెప్పారు. హోం గార్డుల సంక్షేమం కోసం కూడా చర్యలు చేపట్టామన్నారు. అక్టోబరు 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 07.30 గంటలకు పోలీసు అమరవీరుల స్మృతి కవాతు నిర్వహిస్తామని, ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత హాజరుకానున్నట్లు తెలిపారు.

## నాలుగు ఆర్థిక సంస్థలపై ఆర్బీఐ ఆంక్షలు

న్యూఢిల్లీ: భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నాలుగు సంస్థపై రుణాలు ఇవ్వకుండా నిషేధం విధించింది. ఈనెల 21 నుంచి రుణాల మంజూరు కానీ పంపిణీ కానీ చేయకుండా సచిన్ బన్సల్‌కు చెందిన నవీ ఫిన్‌సెర్వ్‌తో పాటు మూడు ఎన్‌బీఎఫ్‌సీలకు నిషేధాజ్ఞలు జారీచేసింది. ఇదే విషయంలో బ్లూమ్‌బెర్గ్ ఏర్పాటు చేసిన ఇండియా క్రెడిట్ ఫోరంలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ ‘మేము పోలీసుల్లా పనిచేయం కానీ ఫైనాన్స్ మార్కెట్‌ను నిశితంగా గమనిస్తుంటాం. దానిపై నిఘా పెడతాం. అవసరమైనప్పుడు మాత్రమే తగు చర్యలు తీసుకుంటాం’ అని అన్నారు. క్రెడిట్ మార్కెట్లపై నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. భారత వృద్ధి స్థిరంగా ఉందని, ద్రవ్యోల్బణం నిర్దేశిత లక్ష్యం పరిధిలోకి దాదాపుగా వచ్చిందని చెప్పారు. అది మధ్యస్థ దశకు చేరుకుంటుందని అన్నారు. వృద్ధి, ద్రవ్యోల్బణానికి సంబంధించి తుది ఫలితంపై ఆర్బీఐ దృష్టిని కేంద్రీకరించిందని శక్తికాంత దాస్ తెలిపారు.

## రూ.56 కోట్ల పీఎఫ్ఐ ఆస్తుల జప్తు: ఈడీ

న్యూఢిల్లీ: నిషేధిత ఉగ్ర సంస్థ ‘పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా’ (పీఎఫ్ఐ)కు చెందిన మొత్తం రూ.56కోట్ల విలువ చేసే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ట్రస్టులు, సంస్థలు, వ్యక్తుల పేరు మీదున్న అవి ఉన్నట్లు గుర్తించింది. ఇందులో రూ.35.43 కోట్లు విలువ చేసే 19 స్థిరాస్తులను గుర్తించినట్లు శుక్రవారం తెలిపింది. అక్రమ పద్ధతుల్లో దేశ, విదేశాల్లో పీఎఫ్ఐ నిధులు సమీకరణ సాగుతోందని ఆరోపించింది. భారత్‌వ్యాప్తంగా 29 బ్యాంకు ఖాతాల్లో అలా సేకరించిన అక్రమ సొమ్మును దాచిందని తెలిపింది. హవాలా, విరాళాల రూపేణ దేశంలో ఉగ్ర కార్యకలాపాలకు నిధులను పీఎఫ్ఐ ఆఫీసు బేరర్లు, సభ్యులు, కేడర్ సమకూర్చినట్లు ఈడీ వెల్లడించింది. బీహార్, కర్నాటక, అసోం, మణిపూర్, మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 29 బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బు జమ చేసినట్లు తెలిసిందని పేర్కొంది. ‘అక్రమ పద్ధతుల్లో డమ్మీ దాతల ద్వారా రూ.94కోట్లు సమీకరించింది. ఇప్పటికి 26 మంది సభ్యులు అరెస్టు కాగా 2021 ఫిబ్రవరి నుంచి 2024 మే వరకు తొమ్మిది ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలయ్యాయి’ అని ఈడీ తెలిపింది. పీఎఫ్ఐకు 13వేలకుపైగా క్రియాశీల సభ్యులు సింగపూర్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొంది. గల్ఫ్‌లోని నాన్ రెసిడెంట్ ముస్లింల నుంచి విరాళాలు సేకరించేందుకు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీలు (డీఈసీలు) ఏర్పాటు చేసుకొని కోట్లలో డబ్బు సమీకించినట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ తెలిపింది.

## ‘ఇండియా’తో పొత్తుకు సై: ఒవైసీ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ‘ఇండియా’ ఐక్యసంఘటనతో పొత్తుకు ఏఐఎంఐఎం సిద్ధంగా ఉన్నట్టు ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. ఎన్డీయేకి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడదామని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే, ఎన్‌సీపీ-ఎస్పీ అధ్యక్షుడు శరద్ పవార్‌కు తమ పార్టీ లేఖ రాసినట్టు ఒవైసీ తెలిపారు. ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది వాళ్లేనని అన్నారు. ‘మేము కూడా మహారాష్ట్రలో షిండే-ఫడ్నవిస్ ప్రభుత్వం రావాలని కోరుకోవడం లేదు. దీనిపై నానా పటోలే, శరద్ పవార్‌కు మా పార్టీ మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ లేఖ రాశారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది వాళ్లే. ఇంతకంటే మేము ఏమి చేయగలం’ అని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఒవైసీ చెప్పారు. మహారాష్ట్రలో ఏఐఎంఐఎంకు గట్టి ఉనికి ఉందని, 2019 ఎన్నికల్లో రెండు సీట్లు కూడా తాము గెలుచుకున్నామని ఆయన గుర్తు చేశారు.

మరాఠా రిజర్వేషన్ పోరాట నేత జరాంగే పాటిల్‌ను సంప్రదిస్తున్నామని తెలిపారు. ఏదిఏమైనా ఎన్నికల్లో ఏఐఎంఐఎం పోటీలో ఉంటుందని స్పష్టంచేశారు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ తేలిగ్గా గెలిచే అవకాశం ఉన్నా గెలవలేదని అన్నారు. అందుకు కారణాలపై విశ్లేషించుకోవాలని, అయినప్పటికీ మహారాష్ట్రలో తాము ప్రయత్నాలు (పొత్తు) చేస్తున్నామని, బంతి వాళ్ల కోర్టులోనే ఉందని చెప్పారు.

## చిక్కుల్లో సీఎం షిండే కుమారుడు

ముంబై: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గర పడుతోన్న తరుణంలో మహారాష్ట్రలో రాజకీయాలు వేడెక్కాయి. సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండేపై విమర్శలు వెల్లువెత్తాయి. నిషేధాజ్ఞలున్నా ఉజ్జయిని మహాకాళి ఆలయం గర్భగుడిలోకి ఆయనను అనుమతించడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దాంతో అధికారులు విచారణకు ఆదేశించారు. శ్రీకాంత్ షిండే...మహారాష్ట్ర థానె జిల్లాలోని కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన గురువారం సాయంత్రం ఈ ఆలయానికి వెళ్లారు. భార్యతో కలిసి గర్భగుడిలోకి వెళ్లి పూజలు చేశారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఏడాది కాలంగా ఆ ఆలయ గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం ఉండటంతో విమర్శలకు దారితీసింది. ‘సామాన్యులు దైవ దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడి వేచిచూస్తుంటే... నిషేధం ఉన్నా వీఐపీలను మాత్రం అనుమతిస్తున్నారు. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధం’ అని కాంగ్రెస్ విమర్శించింది. ఉజ్జయిని జిల్లా కలెక్టర్, ఆలయ కమిటీ ఛైర్మన్ నీరజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ‘మేం ఎవరినీ గర్భగుడిలోకి అనుమతించలేదు. దీనిపై వెంటనే చర్యలకు ఆదేశించాను’ అని వెల్లడించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఈ విమర్శలేవీ పనిచేయవని, హర్యానాలో ఇలాగే తప్పుడు ప్రచారం చేస్తే... ప్రజలు ఎలాంటి ఫలితాన్ని ఇచ్చారో అంతా చూశామని శ్రీకాంత్ షిండే వ్యాఖ్యానించారు.

# పుంజుకున్న టీమిండియా

రోహిత్, విరాట్, సర్ఫరాజ్ అర్ధసెంచరీలు

బెంగళూరు: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మూడో రోజు టీమిండియా పుంజుకుంది. శుక్రవారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 231-3 స్కోర్‌తో ఉంది. ప్రస్తుతం 125 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. క్రీజులో సర్ఫరాజ్ ఖాన్ (70 పరుగులు) ఉన్నాడు. కివీస్ బౌలర్లలో అజాజ్ పటేల్ 2, గ్లెన్ ఫిలిప్స్ 1 వికెట్ చొప్పున పడగొట్టారు. కెప్టెన్ రోహిత్ శర్మ (52 పరుగులు), విరాట్ కోహ్లీ ( 70 పరుగులు), సర్ఫరాజ్‌ఖాన్ అర్ధ సెంచరీలతో రాణించారు. కాగా, రెండవ ఇన్నింగ్స్‌ను భారత్ ఘనంగా ప్రారంభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. 36 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హెన్రీ బౌలింగ్‌లో వరుసగా 4,6,4 బాది అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. అయితే మంచి ఊపులో ఉన్న రోహిత్... తర్వాతి ఓవర్లో అజాజ్ పటేల్ బౌలింగ్‌లో అనూహ్య రీతిలో ఔటయ్యాడు. అజాజ్ వేసిన బంతిని రోహిత్ బ్యాట్‌తో అడ్డుకున్నప్పటికీ బ్యాట్, ప్యాడ్స్ మధ్యలోనుంచి వెళ్లి వికెట్లకు తగిలింది. ఇక యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (35 పరుగులు) కూడా ఫర్వాలేదనిపించాడు.

విరాట్- సర్ఫరాజ్ 136 పరుగుల భాగస్వామ్యం

రోహిత్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన సర్ఫరాజ్‌తో విరాట్ మంచి భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ చకచకా పరుగులు సాధించారు. ఈ క్రమంలోనే సర్ఫరాజ్ కూడా అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 136 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. ఇక గ్లెన్ ఫిలిప్ బౌలింగ్‌లో విరాట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అంతకుముందు కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. రచిన్ రవీంద్ర (134 పరుగులు) సెంచరీతో ఆకట్టుకోగా, డేవన్ కాన్వే (91 పరుగులు), టిమ్ సౌథీ (65 పరుగులు) రాణించారు. రవీంద్ర జడేజా 3, కుల్దీప్ యాదవ్ 3, మహ్మద్ సిరాజ్ 2, జస్ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్ ఒక్కొక్క వికెట్ పడగొట్టారు.

టెస్టుల్లో 9వేల పరుగులు...విరాట్ ఘనత

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్‌లో మరో ఘనత సాధించాడు. టెస్టుల్లో 9 వేల పరుగులు పూర్తి చేశాడు. న్యూజిలాండ్?తో జరుగుతున్న తొలి టెస్టు సెకండ్ ఇన్నింగ్స్?లో 53 వ్యక్తిగత పరుగుల వద్ద విరాట్ ఈ మైలురాయి అందుకున్నాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 9 వేలకుపైగా పరుగుల చేసిన టీమ్‌ఇండియా నాలుగో బ్యాటర్?గా రికార్డు కొట్టాడు. ఈ లిస్ట్?లో సచిన్ తెందూల్కర్, రాహుల్ ద్రవిడ్, సునీల్ గవాస్కర్, విరాట్ కంటే ముందున్నారు. 2011లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన విరాట్ ఇప్పటి వరకు 116 మ్యాచ్‌ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ మాదిరే సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన ముద్ర వేశాడు. ఇప్పటివరకు 197 ఇన్నింగ్స్‌ల్లో 48.99 సగటున 9015 పరుగులు చేశాడు. ఇందులో 29 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అందులో ఏడుసార్లు డబుల్ సెంచరీ మార్క్ అందుకున్నాడు.

## జార్ఖండ్‌లో ఎన్డీయేకు గట్టి దెబ్బ

ఇద్దరు కీలక నేతలు జేఎంఎంలో చేరిక

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీయేకు ఊహించని దెబ్బ తగిలింది. ఎన్డీయే భాగస్వామిగా ఉన్న ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉమాకాంత్ రజక్, బీజేపీ నేత, జమువా నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యే కేదార్ హజ్రా జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)లో శుక్రవారం చేరారు. ఈ ఇద్దరు నేతలు జేఎంఎం టికెట్‌పై జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారని, జమువా సీటు నుంచి కేదార్ హజ్రా బరిలో ఉంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ నేత మంజుదేవి ఇటీవల ఆ పార్టీని వదలి బీజేపీలో చేరారు. ఆమెకు ఈసారి జమువా నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఇస్తుందనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేదార్ హజ్రా జేఎంఎం పార్టీలో చేరాలనే నిర్ణయం తీసుకున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మంజుదేవిపై కేదార్ హజ్రా 18 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో 81 సీట్లకు తమ పార్టీ పోటీ చేస్తుందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గతవారం ప్రకటించారు. పార్టీ పూర్తి ఎన్నికల సన్నద్ధతతో ఉందని, జేఎంఎం కూటమి తిరిగి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని అన్నారు. విపక్ష బీజేపీ తరహాలో జేఎంఎం కూటమి ప్రకటనలకు మాత్రమే పరిమితం కాదని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. డబుల్ ఇంజిన్ బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ 2019లో జేఎంఎం కూటమికి ప్రజలు విజయం కట్టబెట్టారని, ఈసారి కూడా విజయం తమదేనని జేఎంఎం ఎమ్మెల్యే, సోరెన్ భార్య కల్పనా సోరెన్ ధీమా వ్యక్తం చేశారు.

## మనిషి రక్తం రుచి మరిగిన చిరుతను మట్టుబెట్టారు

జైపూర్: మనిషి రక్తమాంసాలు రుచి మరిగిన చిరుత పులిని ఎట్టకేలకు చంపేశారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో మదర్ గ్రామానికి సమీప ప్రాంతంలో చిరుతను గుర్తించి దానిని హతమార్చినట్టు డివిజనల్ ఫారెస్ట్ అధికారి అజయ్ చిత్తోరా పేర్కొన్నారు. నివేదికలు వచ్చిన అనంతరం అది మనుషుల రక్తం రుచి మరిగిన చిరుతేనా, కాదా అనే విషయం పూర్తిస్థాయిలో నిర్ధారణ అవుతుందని పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్రాంతంలో కొన్ని రోజులుగా వరుసగా చిరుత దాడి ఘటనలు కలకలం రేపుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. సాయంత్రం దాటిన తర్వాత ప్రజలు బయటకు రావొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బయటకు వస్తే ఒంటరిగా రావొద్దని, గుంపులుగా రావాలని సూచించారు. చిరుతపులుల భయానికి ఆ ప్రాంతంలో పాఠశాలలు కూడా మూతపడ్డాయి. గత రోల 18 నుంచి ఇప్పటి వరకు చిరుత దాడుల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. విష్ణుగిరి (65) అనే పూజారి ఆలయ సమీపంలో నిద్రిస్తుండగా... చిరుత దాడి చేసి చంపేసింది. రెండు రోజుల క్రితం సైతం చిరుత ఇద్దరు మహిళలపై దాడి చేయడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. దీంతో చిరుతను పట్టుకోవడానికి అటవీశాఖ అధికారులు బోన్లు, కెమెరా ట్రాప్‌లను అమర్చారు. అయితే అది మనుషుల రక్తం రుచి మరిగింది కావడంతో చిరుత కనిపిస్తే కాల్చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు మూడు చిరుతలు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.